ప్రజాశక్తి

సోమవారం 7 జులై 2025 | 8 పేజీలు

ప్రకాశం | బాపట్ల





నల్లబర్లీ పొగాకు

కొనుగోలు కేంద్రాలు పెంచాలి

- కొనుగోలు సాంద్రత కూడా పెంచాలి
- నాణ్యత పేరుతో చెక్కులు వెనక్కి పంపటం సరైంది కాదు..
- రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య



మాట్లాడుతున్న వి.కృష్ణయ్య

ప్రజాశక్తి-పంగులూరు

రాష్ట్ర ప్రభుత్వం నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాలు పెంచాలని, రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య కోరారు. ఆదివారం సాయంత్రం పంగులూరులో విలేకరులతో ఆయన మాట్లాడారు. బాపట్ల జిల్లాలో నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాలు అవసరానికి తగ్గట్టుగా ఏర్పాటు చేయలేదని, దీనివల్ల కొనుగోలు ఆలస్యంగా జరుగుతుందని, రైతులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటివరకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పొగాకు కొనుగోలు కేంద్రాల్లో రోజుకు 200 చెక్కులకు మించి కొనుగోలు జరగటం లేదని, ఈ విధంగా చేస్తే ఎన్ని రోజుల పాటు పొగాకు కొంటారని ప్రశ్నించారు. ఒక్కో కేంద్రంలో రోజుకు వెయ్యి చెక్కుల వరకు కొనుగోలు జరిగితే గానీ రైతులకు కొంత ఉపశమనం ఉండదన్నారు. కొనుగోలు కేంద్రాల్లో నిబంధనల పేరుతో ఎక్కువ చెక్కులను వెనక్కి పంపుతున్నారని విమర్శించారు. రైతుల దగ్గర ఉన్న చివరి ఆకు వరకు కొంటామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, కొనుగోలు కేంద్రాల్లోని బయ్యర్లు నిబంధనల పేరుతో చెక్కులను వెనక్కు పంపుతున్నారని అన్నారు. మొదటి గ్రేడ్ 12 వేలకు, రెండో గ్రేడ్ 9 వేలకు, చివరి గ్రేడ్ 6 వేల రూపాయలు అయినప్పటికీ, మళ్ళీ గ్రేడ్ చేయించుకుని తీసుకురమ్మంటున్నారని, ఇందుకోసం చెక్కులను వెనక్కి పంపుతున్నారని చెప్పారు. వెనక్కి తీసుకెళ్లిన ▶ 2లో

'వెలిగొండ' కోసం

మరో ఏడాది నిరీక్షణ

- 2026 జూన్‌కు పూర్తిచేయాలని సిఎం చంద్రబాబు నిర్దేశం
- ప్యాకేజీలు, పునరావాసం పూర్తయితేనే రిజర్వాయర్‌కు నీళ్లు
- ఏడాదిలో భారీగా నిధులు కేటాయిస్తేనే అనుకున్న లక్ష్యం సాధ్యం



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

వెలిగొండ ప్రాజెక్టును పూర్తిచేసి 2026 జూన్ నాటికి రైతులకు నీళ్లివ్వాలని జల వనరుల శాఖ సమీక్షలో సిఎం చంద్రబాబు నిర్దేశించారు. అంటే మరో ఏడాది దీన్ని పూర్తి చేయడానికి గడువు, లక్ష్యం నిర్ణయించారు. మరో ఏడాది దీని కోసం నిరీక్షణ తప్పదు. మరో వైపు శ్రీశైలం రిజర్వాయర్‌కు ఇదే సమయంలో వరదనీరు వస్తోంది. రిజర్వాయర్ నిండితే వెలిగొండకు నీళ్లిచ్చే అవకాశం ఇప్పట్లో లేదు. ఎందుకంటే రెండు సొరంగాలు అసంపూర్తిగానే ఉన్నాయి. గతేడాది కూడా శ్రీశైలం నిండింది. వరదనీరు దిగువకు వెళ్లింది. అప్పటికే ప్రాజెక్టును పూర్తిచేసినట్లు ప్రారంభోత్సవాలు చేసినా రైతులకు అక్కరకు రాలేదు. పనులు మిగిలే ఉన్నాయి. అసంపూర్తిగా ఉన్న వెలిగొండను పూర్తిచేయడానికి ప్రభుత్వం మరో ఏడాది సమయం తీసుకుంది. ఎన్నికలకు ముందే హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే వెలిగొండను ఏడాదిలోపు పూర్తిచేస్తామని, నిర్వాసితులకు ప్యాకేజీలు ఇస్తామని ప్రకటించారు. ఏడాది గడిచింది. ఏమీ జరగలేదు. దానిపై చెప్పిందే చెప్పడంతోనే ఏడాది గడిచిపోయింది. నిధుల్లేవనే సాకుతో బడ్జెట్‌లోనూ అరకొరగానే చూపారు. ఇటీవల పనుల కోసం మంత్రివర్గ సమావేశంలో రూ.104 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో ఏ పనులు చేపట్టాలనేదీ ప్రశ్నార్థకంగా మారింది. కలెక్టర్ అన్సారియా వెలిగొండకు తక్షణం రూ.889 కోట్లు కావాలని సిఎం చంద్రబాబుకు నివేదించారు. ఆ నివేదికను పరిశీలించి నిధులు మంజూరు చేయలేదు. ఉమ్మడి ప్రకాశంలో ఇద్దరు మంత్రులున్నా వెలిగొండపై సీరియస్‌గా దృష్టి సారించలేదనే చర్చ ఉంది. పశ్చిమ ప్రాంత ఎమ్మెల్యేల్లోనూ వెలుగొండపై అసంతృప్తి కనిపిస్తోంది. సిఎం చంద్రబాబు వద్ద ఏమీ చెప్పలేకపోతున్నారు. 2026 జూన్ నాటికి నిజంగానే పూర్తవుతుందా? అధికారంలోకి వచ్చిన మరుసటి రోజే చెప్పినట్లుగానే జరుగుతుందా? అనేదీ చూడాలి. ఎందుకంటే ఏడాదిలో పూర్తిచేయాలంటే దీనికి భారీగా నిధులు కావాలి. దీని అంచనా వ్యయం రూ.10 వేల కోట్లకు పెరిగింది. ఇప్పటివరకూ రూ.6 వేల కోట్లు ఖర్చు చేశారు. ఇంకా దీనికి రూ.4 వేల కోట్లు నిధులు ఇవ్వాల్సి ఉంది. ఈ స్థాయిలో నిధులు ఇచ్చేది నిజమేనా? అనే చర్చ సాగుతోంది. సొరంగాల పనులు పూర్తి చేయాలి. లైనింగు పనులు పూర్తి కావాలి. అక్కడ తవ్వగా వచ్చిన గ్రావెల్‌ను ▶ 2లో



నిలిచిన వందేభారత్ రైలు

కుక్కను ఢీకొన్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్

చీరాలలో 20 నిమిషాలు నిలిచిన రైలు

2లో ▶



'అమ్మ' పేరుతో ఒక మొక్క

- 10న మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ 2.0
- కలెక్టర్ వెంకటమురళి

8లో ▶

'సమ్మె'కు వామపక్షాల మద్దతు

- ఉద్యోగ, కార్మిక హక్కులను కాపాడుకునేందుకు వామపక్ష, ప్రజాతంత్ర శక్తులు ఏకం కావాలి
- వామపక్షాల పిలుపు...



సమావేశంలో మాట్లాడుతున్న వామపక్షాల నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా జులై 9న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేసేందుకు విశాల మద్దతును కూడగట్టాలని వామపక్ష నేతలు పిలుపునిచ్చారు. ఆదివారం నాడు సిపిఐ ఎంఎల్ జిల్లా కార్యాలయం తరిమల నాగిరెడ్డి భవన్‌లో జరిగిన సమావేశంలో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, ప్రభుత్వ రంగాల పరిరక్షణకు చేపట్టిన దేశవ్యాప్త సమ్మెకు వామపక్షాలు మద్దతు ప్రకటిస్తున్నట్లు ప్రకటించారు. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో ప్రభుత్వ రంగం దేశాభివృద్ధికి పునాదిగా సాగిందని, ప్రభుత్వ రంగం ద్వారా ప్రజలకు కావలసిన పునాదిని ఏర్పాటు చేసిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ గావిస్తోందని చెప్పారు. ఆంధ్రుల హక్కు-విశాఖ హక్కు పేరుతో 32 మంది ప్రాణత్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును సైతం ప్రైవేటీకరించేందుకు కేంద్రం యోచిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో అధికార పక్షంలోని టిడిపి, జనసేనతో పాటు వైసిపి కూడా ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తామని ప్రకటించలేకపోతున్నాయని పేర్కొన్నారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించకుండా ప్రైవేట్ కంపెనీలకు ధారాదత్తం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం యోచిస్తోందన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణకు అందరూ ▶ 2లో

కలిసి బతకలేమని..

- యువ జంట ఆత్మహత్య
- ఇద్దరూ వివాహితులే..



ఆత్మహత్య చేసుకున్న భారతి, రాముడు

ప్రజాశక్తి-కొమరోలు

వారిద్దరికీ అప్పటికే వేరే వారితో వివాహమైంది. వివాహం తర్వాత వారిద్దరి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. కలిసి బతుకుదామనుకున్నారు. అప్పటికే వివాహితులు కావడంతో కలిసి బతకడానికి పెద్దలు అంగీకరించలేదు. దీంతో కలిసి చనిపోదామని నిర్ణయించుకున్నారు. కొమరోలు మండలం, అక్కపల్లె గ్రామ సమీపంలో నిర్మానుష్య ప్రదేశంలో శనివారం రాత్రి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు.

నంద్యాల జిల్లా, డోన్ నియోజకవర్గం ప్యాపిలి మండలం, మాధవరం గ్రామానికి చెందిన వివాహిత నల్లబోతుల భారతి(20)కి, అదే గ్రామానికి చెందిన వివాహితుడు లారీ డ్రైవర్ కంబగిరి రాముడు(26)తో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. రాముడిపై ప్రేమ పెంచుకున్న భారతి గత రెండు సంవత్సరాలుగా తన భర్తకు దూరంగా పుట్టింటిలో ఉంటోంది. భారతి, రాముడు తీరుపై పెద్దలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో తమని విడదీస్తారని భయంతో ప్రేమజంట శనివారం రాత్రి నంద్యాల నుండి కొమరోలు మండలం అక్కపల్లె గ్రామం సమీపానికి చేరుకున్నారు. అక్కడ భారతి, రాముడు చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. రాముడు ఆత్మహత్య చేసుకునే ముందు వాట్సాప్‌లో ఆత్మహత్య చేసుకునే లోకేషన్‌ని తండ్రికి వాట్సాప్‌లో పంపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొమరోలు ఎస్ఐ నాగరాజు తెలిపారు. మృతదేహాలకు గిద్దలూరు ప్రాంతీయ ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతదేహాలను వారి కుటుంబసభ్యులకు అప్పగించారు.

వెలిగొండ కోసం.. మరో ఏడాది నిరీక్షణ

(మొదటిపేజీ తరువాయి)

తొలగించాలి. హెడ్ రెగ్యులేటర్ పనులు, కాలువల పనులు పూర్తి కాలేదు. ఇప్పటికే పూర్తి చేసిన ప్రధాన కాలువ కూడా వర్షాలకు దెబ్బతింది. ఇలా అనేక పనులు పెండింగులో ఉన్నాయి. కనీసం మొదటి దశలో నీరివ్వాలన్నా మొదటి సొరంగం పూర్తి కావాలి. పనుల్లో వేగం లేదు. మరోవైపు నిర్వాసితులు గ్రామాల్లోనే ఉన్నారు. అక్కడ నుంచి బయటకు రావాలంటే వారికి ప్యాకేజీలు ఇవ్వాలి. 7 వేల మందికిపైగా ఉన్నారు. కొత్తగా పెళ్లయిన వారూ ఉన్నారు. వారికీ ప్యాకేజీలు ఇవ్వాల్సి ఉంది. సమయం గడిచే కొద్దీ ఆర్థికభారం పెరగడం తప్ప లాభం లేదు. పునరావాసం పూర్తి కాలేదు. కాలనీలు ఏర్పాటు కావాలి. వెంచర్లు వేశారు. అక్కడ స్కూళ్లు, తాగునీటి పథకాలు, ఇతర సౌకర్యాలు కల్పించాలి. ప్యాకేజీలు ఇచ్చి తరలిస్తే కొత్త ఇళ్లు కట్టుకుంటారు. ఇవన్నీ జరగాలంటే ఏడాది సమయం చాలదు. ఎంత వేగంగా వారికి ప్యాకేజీలు ఇస్తే అంత వేగంగా పనులు జరుగుతాయి. రిజర్వాయర్ నుంచి గ్రామాలు ఖాళీ చేయకుండా సొరంగాలు పూర్తిచేసి నీళ్లివ్వాలన్నా కుదరదు. ఇక ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ మార్కాపురంలో భారీ తాగునీటి పథకానికి శంకుస్థాపన చేశారు. ఇది కూడా వెలిగొండ నీటితోనే ముడిపడింది. 4.25 లక్షల ఎకరాలకు సాగునీరు, 15 లక్షల మందికి తాగునీరు అందించే లక్ష్యంతో ఏర్పాటు చేస్తున్న వెలిగొండ ప్రాజెక్టు మూడు జిల్లాలకు మేలు చేయనుంది. 2026 జూన్ నాటికి పూర్తిచేయాలని సిఎం చంద్రబాబు ఆదేశించారు. దీంతో దానిపై మరోసారి చర్చ తెరపైకి వచ్చింది. నిధులపైనే అన్నీ ఆధారపడ్డాయి. ఆ నిధుల కేటాయింపులను బట్టే దాని నడక సాగనుంది.

పొగాకు కొనుగోలు కేంద్రాలు పెంచాలి

(మొదటిపేజీ తరువాయి)

చెక్కులను గ్రేడ్ చేయించి మరలా తీసుకురావాలంటే అదనంగా మరో అయిదారు వేలు రైతుకు అదనపు భారం పడుతుందన్నారు. రైతులు చెక్కులు తీసుకొచ్చేటప్పుడే అన్ని రకాల గ్రేడ్లు చేయించి తీసుకొస్తున్నారని, మళ్లీ వాటిని వెనక్కి పంపడం సరైంది కాదని అన్నారు. రైతు సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు మాట్లాడుతూ మార్క్ఫెడ్ కొనుగోలు కేంద్రాల్లో రైతులపై అదనపు భారాలు మోపుతున్నారని అన్నారు. ప్రైవేట్ పొగాకు కొనుగోలు కేంద్రాల్లో రైతుకు ట్రాన్స్‌పోర్ట్ ఖర్చుల కింద క్వింటాకు 145 రూపాయలు ఇస్తుండగా, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో రైతుకు డబ్బులు ఇవ్వకపోగా, రైతుల దగ్గర క్వింటాకు 130 రూపాయలు వసూలు చేస్తున్నారని అన్నారు. ప్రైవేట్ కేంద్రాల్లో రైతులు తీసుకెళ్లిన చెక్కుల గోతాలను వెనక్కి ఇస్తుండగా, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో గోతాలు వెనక్కి ఇవ్వటం లేదని, ప్రైవేటు కేంద్రాల్లో రైతులకు టిఫిన్, భోజన ఖర్చులను యాజమాన్యాలన్నీ భరిస్తున్నాయని, ప్రభుత్వ కేంద్రాల్లో మాత్రం ఇవి జరగటం లేదని అన్నారు.

'సమ్మె'కు వామపక్షాల మద్దతు

(మొదటిపేజీ తరువాయి)

ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కాగా అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న కార్మిక చట్టాల వల్ల కనీస వేతనం, పనిగంటలు, పిఎఫ్ గ్రాట్యూటీ వంటి ప్రయోజనాలు సాధించుకోగా.. ఆ చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను అమలుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందన్నారు. ఈ లేబర్ కోడ్స్ అమలు చేస్తే ఉద్యోగుల, కార్మికుల భవిష్యత్తు అంధకారం కానుందని పేర్కొన్నారు. లేబర్ కోడ్స్‌ను నిరోధించేందుకు కార్మికవర్గం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రైతు పండించిన మిర్చి, పొగాకు, శనగ వంటి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, రైతుల సమస్యల పరిష్కారానికి ఉద్యోగ, కార్మికులు అండగా నిలవాలని సూచించారు. రాష్ట్రాల హక్కులపై కేంద్రం చేస్తున్న దాడులను ఈ సందర్భంగా ఖండించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జులై 9 న చేపట్టబోయే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేసేందుకు ఉద్యోగ ఉపాధ్యాయ, కార్మిక, కర్షక విశాల ఐక్యత అవసరమని వారు పిలుపునిచ్చారు. ప్రభుత్వ రంగాన్ని కాపాడుకునేందుకు, ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు, కార్మికుల హక్కులు కాపాడుకునేందుకు, కనీస వేతనాల సాధనకు చేపట్టే సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.మాబు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, సిపిఐ ఎంఎల్ జిల్లా నాయకురాలు ఎస్.లలితకుమారి, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి సిహెచ్.సాగర్, సిపిఐ జిల్లా నాయకులు కొత్తకోట వెంకటేశ్వర్లు మాట్లాడారు.

కుక్కను ఢీకొన్న 'వందే భారత్'

20 నిముషాలు నిలిచిపోయిన రైలు

ప్రజాశక్తి-చీరాల (బాపట్ల జిల్లా)

విజయవాడ నుంచి చెన్నై వెళ్తున్న అత్యాధునిక వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఆదివారం సాయంత్రం చీరాల పట్టణంలో కొన్ని నిమిషాల పాటు అకస్మాత్తుగా అంతరాయం ఏర్పడి నిలిచిపోయింది. స్థానిక ఫైర్‌స్టేషన్ గేట్ సమీపంలో రైలు మార్గంపైకి అనూహ్యంగా వచ్చిన కుక్క రైలు పట్టాలు దాటుతుండగా అదే సమయంలో రైల్వే ట్రాక్‌పై ప్రయాణిస్తున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్ కుక్కను ఢీ కొట్టింది. దీంతో కుక్క కళేబరం రైలు బ్రేక్ వ్యవస్థలో ఇరుక్కోవడంతో రైలు సుమారు 20 నిమిషాలపాటు కదలకుండా అమాంతంగా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో రైల్లోని ప్రయాణికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. విజయవాడలో ప్రారంభమైన రైలు ఒంగోలు మాత్రమే ఆగవలసి ఉండగా అమాంతం చీరాలలో ఒక్కసారిగా ఆగిపోవడంతో ఏం జరిగిందో అర్థం కాక కొంత ఆందోళన చెందారు. అయితే సమాచారం అందుకున్న రైల్వే సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని కళేబరాన్ని తొలగించారు. అయితే బ్రేక్ సిస్టం పాక్షికంగా దెబ్బ తినడంతో వాటి మరమ్మతులు చెన్నైలోని రైల్వే టెక్నికల్ సిబ్బంది మాత్రమే చేయవలసి ఉంది. దీంతో చీరాల రైల్వే టెక్నికల్ సిబ్బంది చెన్నైలోని టెక్నికల్ టీంతో వీడియో కాల్‌లో సంప్రదించి బ్రేక్ సిస్టంలో మరమ్మతులు చేశారు. దీంతో సుమారు 20 నిమిషాల పాటు ఆలస్యంగా కదిలిందని తెలిసింది. ఆ సమయంలో రైలులో ప్రయాణికులు ఉండగా వారి మధ్య కొంతసేపు గందరగోళం నెలకొంది. అయితే రైల్వే సిబ్బంది స్పందనతో ఎలాంటి అవాంఛనీయ పరిణామాలు తలెత్తలేదు. ఇటువంటి ఘటనలు వందే భారత్ లాంటి హైస్పీడ్ రైళ్ల ప్రయాణం మీద ప్రభావం చూపే అవకాశముండటంతో, రైల్వే శాఖ మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం నెలకొంది.

నత్తనడకన నీటి కుంటల నిర్మాణం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

వేసవితో పాటు సాధారణ రోజుల్లో కూడా పంటలను నీటి ఎద్దడిని కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపటింది. వర్షపు నీరు వృధాగా పోకుండా వాటిని పంట పొలాలకు ఉపయోగించుకునే కార్యక్రమాన్ని చేపట్టింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పొలాల్లోనే రైతులు నీటిని నిల్వ చేసుకుని పంటలు ఎండిపోకుండా కాపాడుకునేలా చర్యలు తీసుకుంది. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా రైతుల భూముల్లో పంట సంజీవని పేరుతో ఫారం ఫండ్స్‌ను నిర్మిస్తోంది. ఆసక్తి కలిగిన రైతుల పొలాల్లో ఉపాధి నిధులతో ఫారం ఫండ్స్ నిర్మించుకోవచ్చు.



ఫారం పాండ్

వేసవిలో మేలు..

వేసవిలో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో వ్యవసాయ బావుల్లో సైతం అడుగంటిపోయి నీటి ఎద్దడి ఏర్పడుతోంది. ప్రధానంగా మామికి, అరటి, బొప్పాయి, బత్తాయి, నిమ్మ, పత్తి, మిర్చి, కూరగాయలు, ఉద్యాన వన పంటలకు వేసవి కాలంలో నీటి అవసరం ఎక్కువగా ఉంటుంది. వ్యవసాయ బోర్లు ఉన్నప్పటికీ విద్యుత్ కోతలు సరిపడా నీరు లేకపోవడం వంటి కారణాలతో పంటలకు నీరు అందించలేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి ఆత్యవసర సమయంలో వర్షపు నీటిని నిల్వ చేసే ఫారం ఫండ్స్ వల్ల కొంతమేర ఉపశమనం పొందవచ్చని, పంటలు ఎండిపోకుండా కాపాడుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.

అదనపు ఆదాయం..

ఫారం ఫండ్స్ వల్ల నేలలో తేమ శాతాన్ని పెంచుకునే అవకాశం కూడా ఉంటుంది. ఫండ్స్ గట్లపై కూరగాయల పెంపకం కూడా చేపట్టవచ్చు. ఫలసాయం ఇచ్చే విత్తనాలు కూడా విత్తుకోవచ్చు. నీటిని నిల్వ ఉంచి వివిధ రకాల పంటలకు ఉపయోగించుకోవడంతో పాటు అనుబంధ పంటలను కూడా వేసి అదనంగా ఆదాయం పొందే అవకాశం ఉంది. ఉపాధి హామీ పథకం కూలీలకు సైతం పూర్తి స్థాయిలో స్థానికంగానే పనులు కల్పించడం జరుగుతోంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకానికి పశ్చిమ ప్రకాశంలో స్పందన కరువైంది. పశ్చిమ ప్రకాశంలో సకాలంలో వర్షాలు పడకపోవడంతో భూగర్భజలాల మట్టం పూర్తిగా పడిపోయింది. భూగర్భజలాలు పెంపొందించాలని కూటమి ప్రభుత్వం ఆలోచన చేసింది. ఈ ఏడాదిలో 2,142 నీటి కుంటలు రైతుల పొలాల్లో వర్షాకాలం వచ్చే లోపు నిర్మాణం చేయాలని లక్ష్యం పెట్టుకుంది. నేటి వరకు కేవలం 279 నీటి కుంటలు మాత్రమే పూర్తి చేశారు.

రైతులకు ఉపయోగకరం..

నీటిపారుదల ఉన్న భూముల కంటే ఎక్కువగా మార్కాపురం క్లష్టర్ పరిధిలో మెట్ట భూములే అధికంగా ఉన్నాయి. ఎక్కువగా మెట్ట భూములు ఉన్న రైతులు నీటి కుంటలు 60 అడుగుల పొడవు, 60 అడుగుల వెడల్పు, ఆరు ఆడుగుల లోతు వరకు నిర్మాణం చేసుకుంటే కూలీల వేతనాలతో పాటు మెటీరియల్ బిల్లులు అన్ని కలిపి రూ.2.50 లక్షల వరకు వస్తుంది. ఈ పనులు అన్ని వంద శాతం ఉపాధిహామీ పథకం నిధులతోనే పనులు చేస్తారు. అన్ని పనులు కూలీలు మాత్రమే చేయాల్సి ఉంది. రైతులు మెట్ట ప్రాంతాల్లో నిర్మాణం చేసుకుంటే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. అధికారులు రైతులకు సరైన అవగాహన కల్పించకపోవడంతో వారు పొలాల్లో నీటి కుంటలు నిర్మాణం చేసుకోవడానికి ముందు రాలేదు.

బండారు శ్రీనివాసులు, ఎంపిడివో, యర్రగొండపాలెం



కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో ఈ ఫారం ఫండ్స్ నిర్మిస్తున్నాం. ఇప్పటికే పలు గ్రామాల్లో ఆసక్తి కలిగిన రైతుల పొలాల్లో వీటిని నిర్మించాం. రైతులు రెండు సెంట్లు స్థలం చూపిస్తే చాలు. వారు కోరిన సైజుల్లో ఫండ్స్‌ను నిర్మిస్తాం. రైతులకు పైసా ఖర్చు లేకుంగానే నీటిని నిల్వ చేసుకునే వెసులుబాటు కల్పిస్తున్నాం. వీటిని సద్వినియోగు చేసుకొని పంటలను కాపాడుకోవాలి. ఆసక్తి కలిగిన రైతులు ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో సంప్రదించాలి.



ఆగస్టులోపు పూర్తి చేస్తాం
నిర్మలాదేవి, ఏపీడీ, డ్వామా మార్కాపురం

ఆగస్టు నాటికి ప్రభుత్వం నిర్ణయించిన లక్ష్యాలను పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో ఫారం ఫండ్స్ ఉపయోగాలతో పాటు రైతుకు అందే లబ్ధిని వివరిస్తున్నాం. చాలా మందిని వాటిని నిర్మించుకునేందుకు చైతన్యవంతులను చేస్తున్నాం. రైతులు కూడా ఫారంపాండ్స్ నిర్మించుకునేందుకు ముందుకు వస్తున్నారు.



అవగాహన కల్పించడంలో విఫలం
దుగ్గెంపూడి తిరుపతిరెడ్డి, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి

గ్రామాల్లో ఫారం ఫండ్స్ నిర్మించుకోవడంతో గల ఉపయోగాలను ప్రజలకు, రైతులకు తెలియజేయడంలో ఉపాధి హామీ సిబ్బంది పూర్తిగా విఫలమయ్యారు. అడిగిన వారికి తప్ప మిగతా వారికి వాటి గురించి తెలియపరచడం లేదు. ప్రత్యేకంగా ఫారం ఫండ్స్ పట్ల ఉపాధి హామీ అధికారులు గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేసి రైతులకు చైతన్యం కల్పించారు. ఈ ప్రాంతానికి ఫారం ఫండ్స్ అవసరం ఎంతో ఉంది. సద్వినియోగం చేసుకోవాలి

మండలం	పంచాయతీలు	లక్ష్యం	పూర్తయినవి
దొనకొండ	18	169	40
దోర్నాల	15	190	29
మార్కాపురం	22	355	50
పెద్దారవీడు	19	485	43
పుల్లలచెరువు	19	247	37
త్రిపురాంతకం	24	210	44
యర్రగొండపాలెం	18	486	36



షణ్ముఖ కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జోసఫ్ కుమార్, ఎంపీడీవో జ్యోతి

కోనేరును ఏర్పాటు చేయాలి

ఎన్‌ఆర్‌ఈజీఎస్ డైరెక్టర్ షణ్ముఖ కుమార్

ప్రజాశక్తి-మద్దిపాడు

మండల పరిధిలోని మల్లవరం వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద కోనేరును ఏర్పాటు చేయాలని ఎన్‌ఆర్‌ఈజీఎస్ డైరెక్టర్ షణ్ముఖ కుమార్ అన్నారు. ఆదివారం వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకుని, గుండ్లకమ్మ ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం ఇక్కడ కోనేరు ఏర్పాటు చేయాలని అన్నారు. అదేవిధంగా మొక్కలను పెంచాలని సూచించారు. ఇక్కడికి వచ్చే భక్తులకు ప్రతి ఒక్కరికీ ఒక మొక్క ఇచ్చే విధంగా నర్సరీలను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం శ్రీవారి వనాన్ని చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ముందుగా ఆయనకు ప్రాజెక్టు డైరెక్టర్ జోసెఫ్ కుమార్, ఎంపీడీవో జ్యోతి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ శివప్రసాద్, ఏపీవో ధనుంజయ్ వర్మ, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి 3
సోమవారం 7 జూలై 2025

సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేస్తున్నాం

మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి

ప్రజాశక్తి-టంగుటూరు

ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేస్తున్నామని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. టంగుటూరు మండలం మర్లపాడులో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచుతూ ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. మెగా డీఎస్సీతో 13 వేల టీచర్ ఉద్యోగాలు భర్తీ చేస్తున్నామన్నారు. అన్న క్యాంటీన్‌లు రద్దు చేసి జగన్ పేదల కడుపు కొట్టారన్నారు. చంద్రబాబు నాయుడు అన్న క్యాంటీన్‌తో పేదల ఆకలి తీర్చుతున్నారని తెలిపారు. ప్రతి పేదవాడి ముఖంలో చిరునవ్వులు చూడాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడు

మద్దిపాడు: మండల పరిధిలోని బసవన్నపాలెంలో సంతనూతలపాడు నియోజకవర్గ కోఆర్డినేటర్ మండవ జయంత్ బాబు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జయంత్ బాబు సంవత్సర కాలంలో కూటమి ప్రభుత్వ నేతృత్వంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికి వెళ్లి వివరిస్తూ కరపత్రాలు పంచి, గ్రామంలో ప్రతి కుటుంబానికి తెలియఎ రిచారు. గ్రామంలో రూ.30 లక్షల నిధులు తోడు సిమెంట్ రోడ్లు, సైడ్ కాలువల నిర్మాణం పూర్తి చేశారని చెప్పారు. గ్రామంలో నూతన కరెంటు స్తంభాలు వేశారని , వాటర్ ట్యాంక్ ఊర చెరువుని అభివృద్ధి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ దేవ బత్తిన ప్రసాద రావు,యూనిట్ ఇంచార్జి మండవ గోపీచంద్, రైతు నాయ



మర్లపాడులో కరపత్రాలు పంచుతున్న మంత్రి స్వామి

కులు అబ్బూరి శేషగిరిరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు కొప్పోలు విశ్వనాథం, బూత్ కన్వీనర్ రెబ్బవరపు ప్రభాకర్ రావు, మండవ గోవిందరాజులు, తుమ్మల వీరాంజనేయులు, మారెళ్ళ మాధవరావు, రెబ్బవరపు హరి, గన్నెపూడి రామారావు, పొదిలి సుధాకర్, రావినూతల ప్రవీణ్, మండవ లక్ష్మీనారాయణ, తల్ప సాయి, రెబ్బవరపు అంజయ్య ఆర్ల అమరయ్య తదితరులు పాల్గొన్నారు.

కనిగిరి: సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం కనిగిరి మున్సిపాలిటీ ఒకటవ వార్డు పరిధిలోని 144 బూత్‌లో శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు కనిగిరి పట్టణ టిడిపి ఇంచార్జ్ తమ్మినేని శ్రీనివాసులు రెడ్డి ఆదివారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి సంవత్సర కాలంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు తమ్మినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ టీడీపీ కూటమి పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ బాల బాబు, బూత్ ఇంచార్జ్ నరసింహ, కో యూనిట్ ఇంచార్జ్ దుర్గ, నాగమణి, ఫాతిమా లక్ష్మీనారాయణ, కిరణ్, జానీ పాల్గొన్నారు.

దర్శి: దర్శి మండలం లంకోజనపల్లి గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు నారపుశెట్టి పాపారావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దర్శి మండల టిడిపి అధ్యక్షులు మారెళ్ళ వెంకటేశ్వర్లు, టిడిపి సీనియర్ నాయకులు గొర్రె సుబ్బారెడ్డి, క్లస్టర్ల నానబాల అంకయ్య, రూపేనేని రామారావు, నారపుశెట్టి మధు, గ్రామ పార్టీ అధ్యక్షులు మామిళ్ళ సిద్దయ్య, టిడిపి నాయకులు ఎలు



పీసీపల్లిలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర

గొండారెడ్డి, సానే సుబ్బయ్య, గణపతి, ఫణిదపు వెంకట్రామయ్య, బెల్ల శ్రీను, వెంకటనారాయణ, వాసు, శ్రీనివాసరెడ్డి, యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ ఇన్‌చార్జిలు, లంకోజన పల్లి గ్రామ టిడిపి నాయకులు బాలగురవయ్య, నెహెమియా, మార్క్ పాల్గొన్నారు.

పీసీపల్లి: ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందే విధంగా చర్యలు చేపట్టాలని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా ఆదివారం ఆయన మండల కేంద్రమైన పిసీపల్లిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు గురించిన, కరపత్రాలు ఇంటింటికీ తిరిగి స్వయంగా ఆయనే పంపిణీ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందకపోతే నా దృష్టికి తీసుకురావాలన్నారు.వీరివెంట పామూరు మండల టిడిపి నాయకులు యారవ శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షులు వేమూరి రామయ్య, నాయకులు వీరపనేని పెద్దన్న, గోగడ రత్తయ్య, గోగడ మాలకొండయ్య ఉన్నారు.

సీఎస్‌పురం: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రభుత్వ పథకాల గురించి సుపరిపాలన కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన సిఎస్.పురంలోని వడియ రాజుల నగర్‌లో టిడిపి నాయకులు ఆదివారం కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రతి ఇంటికీ తిరిగి ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా యూనిట్ ఇన్‌చార్జి బత్తుల వెంకటాద్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడం జరిగిందని తెలిపారు.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న జయంత్ బాబు

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి-దొనకొండ

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని వెంకటాపురం గ్రామంలో ఆదివారం జరిగింది. ఎస్ఐ త్యాగరాజు తెలిపిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన జల్ది వెంగలమ్మ(36) మండలంలోని తెల్లబాడు గ్రామానికి చెందిన మరియదాసుతో గత 19 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వారికి ఒక కుమారుడు ఉన్నాడు. భార్యభర్తల మధ్య మనస్పర్ధల కారణంగా గత 15 సంవత్సరాలుగా వేరుగా ఉంటున్నారు. వెంగలమ్మ వెంకటాపురంలో కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తోంది. అదే గ్రామంలో జగనన్న కాలనీలో ఇళ్లు నిర్మించుకుంది. శనివారం ఉదయం 10 గంటల సమయంలో జగనన్న కాలనీలోని ఇంటి వద్దకు వెళ్లి వస్తానని తల్లితండ్రులకు చెప్పి వెళ్లింది. రాత్రి అయినా రాకపోవడంతో తండ్రి చెన్నయ్య, బంధువులు జగన్న కాలనీలోని ఇంటి వద్దకు వచ్చి చూడగా శ్లాబుకు ఉన్న ఇనుప రాడ్‌కు చీరతో ఉరి వేసుకొని ఉంది. ఆందోళనలతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ త్యాగరాజు సంఘటనా ప్రదేశంకు చేరుకొని పరిసరాలను పరిశీలించి తండ్రి చెన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఆత్మహత్యకు గత కారణాలను దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ త్యాగరాజు

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

రూ.3 లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం ఊళ్ల పాలెం గ్రామంలో షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు పూర్తిగా బూడిదైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గౌరవపు సునీల్ పూరి గుడిసెలో షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగి క్షణంలోనే ఇల్లు మొత్తం అంటుకుంది. టంగుటూరు ఫైర్ సిబ్బంది వచ్చి మంటలార్పే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే పూర్తిగా ఇల్లు మొత్తం కాలి బూడిదైపోయింది. సుమారు మూడు లక్షల రూపాయలు విలువైన వస్తువులు, డబ్బులు కాలి బూడిద అయ్యాయని బాధితులు తెలిపారు. తమకు ప్రభుత్వం న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

వలంటీర్స్ వింగ్ స్టేట్ సెక్రటరీగా రామకృష్ణ

ప్రజాశక్తి-కొండపి

కొండపికి చెందిన రావులపల్లి రామకృష్ణ స్టేట్ వాలంటీర్స్ వింగ్ సెక్రటరీగా నియమితులైనట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా రావులపల్లి రామకృష్ణ మాట్లాడుతూ నాకు ఈ అవకాశం కల్పించిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డికి, జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డికి, మాజీమంత్రి, పీఏసీ సభ్యులు డాక్టర్ ఆదిమూలపు సురేష్‌కి, స్టేట్ ఐటింగ్ జోనల్ ప్రెసిడెంట్ పోస్ట్ పూసపాటి మణికంఠేశ్వర్ రెడ్డికి కతజ్ఞతలు తెలిపారు. పార్టీ గెలుపునకు కృషి చేస్తానన్నారు.



రామకృష్ణ

డంపింగ్ యార్డు తరలించాలని నిరసన

ప్రజాశక్తి-చీమకుర్తి

మండలంలోని కె అగ్రహారం గ్రామానికి సమీపంలో ఉన్న చీమకుర్తి మున్సిపల్ డంపింగ్ యార్డ్‌ను తరలించాలని కోరుతూ గ్రామస్తులు డంపింగ్ యార్డ్ ఎదుట నిరసన తెలియజేశారు. ఆదివారం డంపింగ్ యార్డ్ తగలబెట్టడం వలన వచ్చిన పొగకు గ్రామస్తులు ఉక్కిరిబిక్కిరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ చీమకుర్తి మున్సిపాలిటీ డంపింగ్ యార్డ్ నివాసాల మధ్య ఉండటం వలన చెత్తను తగలబెట్టినప్పుడు పొగం చూరుతుందని, దీని వలన ఇబ్బందులు పడుతున్నామన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు ఊపిరాడక బాధపడుతున్నారని తెలిపారు. ఈపాటికే పలువురు వ్యాధులతో బాధపడుతూ చికిత్స నిమిత్తం ఆసుపత్రులకు వెళ్లి వస్తున్నారని పేర్కొన్నారు. సమస్యను అధికారులు దృష్టికి ఎన్నిసార్లు తీసుకువెళ్లినా పట్టించుకోలేదన్నారు. సమస్యను గుర్తించి తక్షణమే డంపింగ్ యార్డును తరలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పల్లాపల్లి సుబ్బారావు, వాడేపల్లి ఏడుకొండలు, తొట్టెంపూడి రామారావు, పల్లాపల్లి ఆంజనేయులు, కోనంకి తిరుమల, అణుకు శివ, పల్లాపల్లి ఆదినారాయణ, చెల్లుబోయిన ప్రభాకర్, యానం సుబ్బారావు కౌరబోయిన సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న గ్రామస్తులు



రాళ్లు తేలి అధ్వానంగా ఉన్న రోడ్డు

రాళ్ల దారిలో అవస్థల ప్రయాణం

ఇబ్బందులు పడుతున్న దేవకిమర్రి ప్రజలు

రోడ్డు వేసి ఆదుకోవాలని వేడుకోలు

ప్రజాశక్తి- సీఎస్‌పురం రూరల్

మండలంలోని అటవీ ప్రాంత గ్రామమైన దేవకిమర్రి రోడ్డు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామానికి వెళ్లాలంటే రాళ్ల దారే దిక్కయింది. మండలంలోని బోయ మడుగుల పంచాయతీలో డిజీపేట కోనపల్లి ఆర్అండ్‌బి రహదారి నుంచి దాదాపు అర కిలోమీటర్ దూరంలో అటవీ ప్రాంతంలో ఈ దేవకీమర్రి గ్రామం ఉంది. ఈ గ్రామానికి వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం సరిగా లేకపోవడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అర కిలోమీటర్ పైగా దూరం ఉన్న కాలిబాట మొత్తం రాళ్లు తేలి ఉంది. ఎన్నికల సమయంలో రోడ్డు బాగు చేస్తామని హామీ ఇవ్వడం తప్ప తమ ఇబ్బందులను పట్టించుకునే వారే లేరు అంటూ గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయించి ఇబ్బందులు తీర్చాలని వారు కోరుతున్నారు.



బైరెడ్డి సిద్ధార్థ రెడ్డితో మారెడ్డి వెంకటాద్రి రెడ్డి

బైరెడ్డి సిద్ధార్థ రెడ్డిని కలిసిన మారెడ్డి

ప్రజాశక్తి-కొండపి

వైసీపీ యూత్ వింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డిని హైదరాబాదులోని వారి గృహంలో యూత్ వింగ్ జోనల్ ప్రెసిడెంట్ మారెడ్డి వెంకటాద్రి రెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 11న శుక్రవారం కొండపిలో జరగబోయే నియోజకవర్గ సమావేశానికి ప్రత్యేక అతిథిగా ఆహ్వానించినట్లు తెలిపారు. ఈయన వెంట నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు మారం రెడ్డి గంగాధర్ రెడ్డి, భీమనాథం వెంకటరెడ్డి ఉన్నారు.

కొండపి పోలీస్ స్టేషన్‌లో ఎస్పి తనిఖీ

ప్రజాశక్తి-కొండపి

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ ఏ.ఆర్ దామోదర్ అన్నారు. శనివారం రాత్రి కొండపి పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో లా అండ్ ఆర్డర్ నేర నివారణ వ్యూహాల తీసుకుంటున్న చర్యలపై అధికారులను ఆరా తీసి పలు సూచనలు చేశారు. జిల్లా ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ పెండింగ్ కేసులలో విచారణ త్వరిగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ వెంట స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, కొండపి సర్కిల్ ఇన్స్పెక్టర్ సోమశేఖర్, ఎస్సై ప్రేమ్ కుమార్ సిబ్బంది ఉన్నారు.



స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్



చంద్రబాబుతో ఎంఎల్ఎ నరేంద్రవర్మ

చంద్రబాబుతో నరేంద్రవర్మ భేటీ

ప్రజాశక్తి - బాపట్ల

ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ ఆదివారం అత్యవసరంగా భేటీ అయ్యారు. నియోజకవర్గంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించేందుకు సిఎం చంద్రబాబు పిలిపించుకుని ప్రత్యేకంగా మాట్లాడినట్లు తెలిసింది. బాపట్లలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై ముఖ్యమంత్రి ప్రధానంగా నరేంద్ర వరంతో చర్చించినట్లు తెలుస్తోంది. ఏడాది పాలనలో ఇప్పటి వరకు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై నరేంద్రవర్మ సిఎంకు వివరించినట్లు చెబుతున్నారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలో వివిధ శాఖల వారీగా రూ.97.18 కోట్లలతో చేపట్టే అభివృద్ధిపై సిద్ధం చేసిన ప్రణాళికలు ప్రతిపాదనలు సిఎంకు అందజేసినట్లు చెప్పారు. సిఎం చంద్రబాబు ఇటీవలే పి4లో భాగంగా పట్టణం బేతనీ కాలనీలో చిన్నారులు సందీప్, హేమశ్రీలను నరేంద్ర వర్మ దత్తత తీసుకున్న విషయాన్ని ప్రస్తావించారని తెలుస్తోంది. ఆదివారం ఆగమేఘాలపై సిఎం నుండి ఎమ్మెల్యే నరేంద్ర వర్మను అత్యవసరంగా కలవాలని కబురు రావడం పట్ల ఆంతర్యం ఏమిటని రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.



సిసి రోడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

సిమెంటు రోడ్డు ప్రారంభం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

అమృతలూరు మండలం మోపర్రు గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం, పల్లె పండుగలో భాగంగా రు.25 లక్షల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్లను శాసన సభ్యులు నక్కా ఆనందబాబు ఆదివారం ప్రారంభించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఇంటింటికి తిరిగి ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ పథకాల వివరాలతో కూడిన పాంప్లెట్లను పంపిణీ చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు నమోదు చేసుకుని టిడిపి యాప్‌లో నమోదు చేయించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీలు ఇచ్చారు. గ్రామాల్లో ప్రజల సమస్యలు గుర్తించి తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో వేమూరు ఎఎంసి చైర్మన్ గొట్టిపాటి పూర్ణ కుమారి గంగాధర్, అమృతలూరు ఎంపిడిఒ మారుతి శేషమాంబ, మోపర్రు గ్రామంలోని తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా సర్పంచులకు శిక్షణ

ప్రజాశక్తి - అమృతలూరు

మండలంలోని వివిధ గ్రామాల మహిళా సర్పంచులకు రేపల్లె ఎంపిడిఒ కార్యాలయంలో మూడు రోజులపాటు శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ మారుతి శేష మాంబ తెలిపారు. మండలంలో 8మంది మహిళా సర్పంచులు ఉన్నారని తెలిపారు. వీరికి ఈనెల 7, 8, 9 తేదీల్లో శిక్షణ జరుగుతుంది అన్నారు. ఈ శిక్షణకు మహిళా సర్పంచులు తప్పని సరిగా హాజరయ్యేట్లుగా సంబందిత గ్రామాల పంచాయతీ కార్యదర్శులు సర్పంచులకు వివరించాలని చెప్పారు. గోవాడ, ఇంటూరు, కొరుతాడిపర్రు, కూచిపూడి, మూల్పూరు, తురుమెళ్ల, వామనగుంటపాలెం, యాడవూరు సర్పంచులు మండవ విజయలక్ష్మి, మద్దు జీవమని, తాడిచెట్టి రమాదేవి, కొండమూడి శ్యామల, మూల్పూరు జయశ్రీ, అడుసుమల్లి ఇదిర, వేలినేని లక్ష్మీ, కుర్ర నాగమల్లేశ్వరి పాల్గొనాల్సి ఉందని తెలిపారు. ఆధార్ కార్డ్, ఆధార్‌కు లింకైన ఫోన్ నెంబర్ ఉన్న ముబైల్ తీసుకొని రావాలని సూచించారు.

సమ్మెను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి - బాపట్ల

ఈనెల 9న దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్ కోరారు. ఏఐటియుసి కార్యాలయం లో జరిగిన కార్మిక సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా సార్వత్రిక సమ్మె ఈనెల 9న జరుగుతుందని అన్నారు. జిల్లాలో అన్ని మండలాల్లో ఉద్యోగులు, కార్మికులు, స్కీం వర్కర్లు పెద్ద ఎత్తున సమ్మెలో పాల్గొని నిరసన ప్రదర్శన నిర్వహించాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి సామ్యూల్ మాట్లాడుతూ సార్వత్రిక సమ్మెకు మద్దతుగా రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు భాగస్వామ్యం అవుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టియూసి నాయకులు రవి, ఐఎఫ్‌టియు నాయకులు ఎం ప్రసాద్, సిఐటియు నాయకులు కె శరత్ పాల్గొన్నారు.

అద్దంకి : దేశవ్యాప్తంగా జూలై 9న జరుగునున్న కార్మిక సమ్మె జయప్రదం చేయాలని కోరుతూ పట్టణంలో సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక బంగ్లా రోడ్డులోని అంబేద్కర్ కాంస్య విగ్రహం వద్ద బైక్ ర్యాలీని సిపిఎం సీనియర్ నాయకులు కావూరి రఘు చంద్ జెండా ఊపి ప్రారంభించారు. కార్మిక సోదరులు అంబేద్కర్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కావూరి రఘు చంద్ మాట్లాడుతూ కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం ఇష్టారాజ్యంగా మార్చి 4 లేబర్ కోడ్స్‌గా కొచ్చిందని అన్నారు. కార్మిక హక్కులు కాపాడాలని కోరారు. కనీస వేతనాలు అమలు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని అన్నారు. కార్మిక వర్గం ఐక్యంగా నిలబడి సమ్మకు సిద్ధం కావాలని కోరారు. బైక్ ర్యాలీ బాబాయిని సెంటర్, ప్రభుత్వ వైద్యశాల మీదగా గాంధీ బొమ్మ సెంటర్ నుండి పురపాలక సంఘం వరకు నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం, సిఐటియు నాయకులు తిరుపతి రెడ్డి, కోటేశ్వరరావు, బి విజయ్ కుమార్, న్యాయవాది గంగాధరరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పి ఆదాం, గాలి భీష్మ, పసుమర్తి గిరి, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

రేపల్లె : రకార్మికులకు నష్టం చేసే 4 లేబర్ కోడ్స్ అమలు చేయవద్దని కోరుతూ జూలై 9న జాతీయ సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్ కోరారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో కార్మిక సంఘాల సమ్మె సన్నాహాక ఉమ్మడి సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశంలో ఆయనతోపాటు ఎఐటియుసి జిల్లా కౌన్సిల్ సభ్యులు సింగం వాణి, రైతుకూలీ సంఘం రాష్ట్ర నాయకులు ఎం శోభారాణి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను కార్మిక వర్గం ఉమ్మడిగా తిప్పికొట్టాలని అన్నారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఐదేళ్లకోసారి కనీస వేతనాలు సవరణ చేయాలని, కేంద్రంలో 8వ వేతన సంఘాన్ని, రాష్ట్రంలో 12వ వేతన సంఘాన్ని నియమించాలలని కోరారు. 'ఈశ్రమ'లో నమోదైన కార్మికులు అందరికీ సామాజిక భద్రత కల్పించాలని కోరారు. ముఠా, రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలని అన్నారు. జులై 9న జరిగే సమ్మెలో కార్మికులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్టియు న్యూ కేంద్ర కార్మికసంఘాలు, ఎఐటియుసి నాయకులు పి బిక్షాలు, కోన శ్రీను, సిఐటియు నాయకులు కె ఝాన్సీ, పి విజయ్, కె ఆశీర్వాదం, కె రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు కావూరి రఘుచంద్



కార్మిక సంఘాల సమావేశంలో సిఐటియు అధ్యక్షులు సిహెచ్ మణిలాల్

సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి - బాపట్ల

గతేడాది సమ్మె కాలంలో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను అమలు చేయాలని కోరుతూ స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ఇంజనీరింగ్ కార్మికులు గెట్ మీటింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో 17 రోజుల సమ్మె ఒప్పందాలు అమలు చేస్తుందని, వేతనాలు కొంతమేరకైన పెరుగుతాయని కార్మికులు ఎదురు చూశారని అన్నారు. ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంజనీరింగ్ కార్మికులు ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమని అన్నారు. ఇంజనీరింగ్ కార్మికులతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని అన్నారు. కార్మికులు అందరికి రాష్ట్రంలో ఇతర ఉద్యోగులకు అందిస్తున్న అన్ని సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం, జిఒ నెంబర్ 36 ప్రకారం రూ.24,500 వేతనం అమలు చేయాలని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం జూలై 4 నుండి రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు సమ్మెలో పాల్గొంటామని తెలిపారు. కార్యక్రమంలో చేతి వృత్తదారుల సంఘం జిల్లా కన్వీనర్ పి కొండయ్య, సిఐటియు నాయకులు కె శరత్, మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి మురళీకృష్ణ, ఇంజనీరింగ్ వర్కర్స్ నాయకులు హరిబాబు, నాని, రత్నం, ప్రమీల పాల్గొన్నారు.


అద్దంకి : మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మస్టర్ పాయింట్ గేటు వద్ద ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ కార్మికులకు జిఒ నెంబర్ 36 ప్రకారం కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత వారం నుండి వివిధ రూపాల్లో నిరసన చేపడుతున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా గేటు మీటింగ్ నిరసన తెలిపారు. ఈసందర్భంగా సిఐటియు నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఉసురుపాటి శామ్యూల్, కె జాన్ మారుతి, మార్కు, రవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తంగిరాల వెంకటేశ్వర్లు

'భవనం'కు వైసిపిలో బాధ్యతలు

ప్రజాశక్తి - ఇంకొల్లు



మాజీ జడ్పిటిసి భవనం శ్రీనివాసరెడ్డి

వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్మోహనరెడ్డి ఆదేశాల పర్చూరు నియోజకవర్గంకు చెందిన ఇంకొల్లు జడ్పిటిసి భవనం శ్రీలక్ష్మి భర్త భవనం శ్రీనివాసరెడ్డి, మండలంలోని పావులూరుకు చెందిన బట్టు అనిల్ కుమార్‌కు వైసిపి సంస్థాగత పదవుల్లో నియమించారు. అనిల్ కుమార్ వైసీపీ సోషల్ మీడియా విభాగం కార్యదర్శిగా నియమితులయ్యారు. ఇద్దరికీ పదవులు అప్పజెప్పడంపట్ల కృతజ్ఞతలు తెలిపారు. వైసీపీ కార్యకర్తలు వీరిని అభినందించారు.

ఘనంగా మొహర్రం వేడుకలు

ప్రజాశక్తి - యద్దనపూడి



మొహరం వేడుకల్లో ముస్లిం సోదరులు

మండలంలోని పూనూరు, పోలూరు, గన్నవరం, అనంత వరం, జాగర్లమూడి గ్రామాల్లో ముస్లిం సోదరులు మొహరం వేడుకలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. మహమ్మద్ ప్రవక్త మనుమలు యుద్ధంలో వీరమరణం పొందిన రోజుని, వారిని గుర్తు చేసుకోవడమే పండగ ఉద్దేశమని అన్నారు. కార్యక్రమంలో పోలూరు విఆర్ఎ కరిముల్లా, జాగర్లమూడికి చెందిన మస్తాన్ వలి, సిఆర్పి మాబు సుభాని, సైదావలి పాల్గొన్నారు.

'దాచూరి' మెడికల్ క్యాంపుకు

విశేష స్పందన

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

దాచూరి రామిరెడ్డి రెగ్యులర్ మెడికల్ క్యాంపునకు విశేష స్పందన లభించింది. ఒంగోలు నెల్లూరు బస్టాండ్ సమీపంలోని టిటిడి కళ్యాణ మండపంలో ఆదివారం ఉదయం ఐదు గంటలకే నిర్వాహకులు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. బిపి, షుగర్, ఫిట్స్, పక్షవాతం రోగులకు జిబిఆర్ ఫౌండేషన్ సహకారం, యుటిఎఫ్ సౌజన్యంతో దాచూరి రామిరెడ్డి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మెడికల్ క్యాంపుకు 1565 మంది పేషంట్లు హాజరై వైద్య సేవలు పొందారు. ఈ క్యాంపునకు ప్రముఖ వైద్యులు డాక్టర్ గోపాళం శివన్నారాయణ, డాక్టర్ బి.హరిబాబు, డాక్టర్ కె.శ్రీధర్‌బాబు, డాక్టర్ రంజిత్ భాషా, డాక్టర్ సుందర ప్రసాద్, డాక్టర్ సమీర్ తో పాటు పలువురు వైద్యులు పాల్గొని వైద్య సేవలు అందించారు. ఈ క్యాంప్‌లో 2 నెలలకు సరిపడా మందులు రూ 200 లకు అంద చేశారు. అవసరమైన రోగులకు అతి తక్కువ ధరకు ఇన్సులిన్ అందజేశారు. ఈ సందర్భంగా క్యాంప్ కన్వీనర్ మాదాల వెంకటరావు మాట్లాడుతూ వైద్యం ఖరీదుగా మారిన నేపథ్యంలో తక్కువ ఖర్చుతో పేదలకు వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో దాచూరి రామిరెడ్డి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జిబిఆర్ ఫౌండేషన్ సహకారంతో మెడికల్ క్యాంపును క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామన్నారు. మెడికల్ క్యాంపు నిర్వహణకు రూ.10 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందించిన ప్రముఖ వైద్యులు డాక్టర్ బి జవహర్(చీమకుర్తి), రాపర్లకు చెందిన ఢాకా చింపిరిరెడ్డి వెంకమ్మల జ్ఞాపకార్థం అందించిన ఢాకా సుబ్బారెడ్డికి వెంకటరావు కతజ్ఞతలు తెలిపారు. మెడికల్ క్యాంపునకు స్వచ్ఛందంగా సేవలందిస్తున్న వైద్యులకు, వైద్య సిబ్బందికి, ప్రజాసంఘాల నేతలకు ఆయన కతజ్ఞతలు తెలిపారు. కాగా మెడికల్ క్యాంపు నిర్వహణలో రిజిస్ట్రేషన్, టెక్నికల్, ఫార్మసీ, కౌన్సిలింగ్ వంటి విభాగాలలో స్వచ్ఛందంగా సేవలందించిన 120 మంది ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలను వెంకట్రావు ప్రత్యేకంగా అభినందించారు.


వైద్యసేవలందిస్తున్న డాక్టర్లు

అక్రమ లేఅవుట్లపై కొరడా

- మంత్రి ఆదేశాలతో కదిలిన అధికార యంత్రాంగం
- హెచ్చరిక బోర్డు పెట్టిన అధికారులు
- హుడాకి పట్టని వైనం..

ప్రజాశక్తి-శింగరాయకొండ

అక్రమ లేఅవుట్లపై అధికార యంత్రాంగం కొరడా ఝుళిపిస్తోంది. మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి ఆదేశాలతో అధికారులు కదిలి హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేశారు. ఓ పక్క సోమరాజుపల్లి గ్రామ పంచాయతీలో వక్ఫ్‌బోర్డు భూముల్లో అక్రమ లేఔట్లు వేసి.. అక్రమ కట్టడాలు కట్టినప్పటికీ అధికారులు పట్టించుకోలేదు. అదే రీతిలో కనుమల్ల పంచాయతీలో కలికివాయి గ్రామపంచాయతీలో సోమరాజుపల్లి గ్రామ పంచాయతీలో అక్రమ లే అవుట్లు వేసి అడ్డగోలుగా అమ్మకాలు చేపడుతుంటే అధికారులకు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రత్యేకంగా ప్రత్యేక దృష్టి పెట్టి పట్టించుకోవలసిన ఒంగోలు హుడా అధికారులు ఇటు వైపు కన్నెత్తి చూడని పరిస్థితి. ఎవరికైనా కడుపు మండి ఫిర్యాదు చేస్తే అప్పుడు వచ్చి చేసే హడావుడి అంతా ఇంతా కాదు. అదే రీతిలోనే గతంలో పాత శింగరాయకొండలో జగనన్న లేఅవుట్ పక్కనే అక్రమ లేఔట్ వేసి కాగితాల్లో అమ్మకాలు చేపట్టి డబ్బులు జేబులో పెట్టుకొని రియల్టర్లు వెళ్ళిపోయారు. నేడు అదే రీతిలో శింగరాయకొండలో ప్రభుత్వ అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన అక్రమ వెంచర్లపై రెవెన్యూ, పంచాయతీశాఖ అధికారులు కొరడా ఝులిపించారు. హుడా అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన శానంపూడి పంచాయతీ పరిధిలోని సర్వేనెంబర్ 483-2లో వేయబడిన వెంచర్‌లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. సదరు వెంచర్‌కి ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేవని, ఈ వెంచర్‌లో కొనుగోలు చేసి నిర్మించబోయే వాళ్ల నిర్మాణాలకు ఎటువంటి అనుమతులు ఇవ్వటం జరగదని, ఈ వెంచర్ యజమానులకు ఏపీఎంఅండ్ హుడా చట్టం 2016 ప్రకారము వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని శానంపూడి పంచాయతీ కార్యదర్శి సాంబశివరావు హెచ్చరించి.. అక్కడ బోర్డును ఏర్పాటు చేశారు. కనుమల్ల పంచాయతీ పరిధిలోని కందుకూరుకు వెళ్ల జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న సర్వేనెంబర్ 329/1, 329/2, 368లో ఏర్పాటు చేసిన అనధికారక లేఔట్‌లో కనుమల్ల పంచాయతీ కార్యదర్శి సునీత హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. సదరు వెంచర్ యజమానులకు హుడా చట్టం ప్రకారం నోటీసులు కూడా జారీ చేశామని తెలిపారు. కందుకూరు-శింగరాయకొండ మధ్యలో జాతీయ రహదారికి అనుకొనే ఈ వెంచరు నిర్మాణం చేపడుతున్నప్పటికీ అధికారులు ప్రతిరోజూ వస్తూపోతూ చూస్తూ ఉన్నారు తప్ప ఆ వెంచర్ వద్దకు వెళ్లి అనుమతులు ఉన్నాయా, లేవా అనే విషయాన్ని ఇప్పటివరకు చర్చించకపోవడం విశేషం. మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. అనుమతులు లేకుండా అక్రమంగా వెంచర్ల నిర్మాణం చేపడితే ప్రభుత్వానికి నష్టమని, కొనుగోలుదారులకు కూడా ఇబ్బందులు ఉంటాయని చెప్పడంతో.. అధికారులు వెంటనే అక్కడికి వెళ్లి అనుమతులు తీసుకోవాలని చెప్పారు. సోమరాజుపల్లి గ్రామపంచాయతీలో వక్ బోర్డు స్థలం కూడా ఇదే పరిస్థితి కొనసాగింది. అధికారులు మామూళ్ల మత్తుకి అలవాటు పడి.. వెంచర్లు వేస్తున్న వారి వద్ద నయానోబయానో తీసుకొని వదిలివేయటం ద్వారా సమస్య పెద్దదవుతోంది. అధికారులు తక్షణమే స్పందించి ఇలాంటి వాటిపై చర్యలు తీసుకుంటే అక్రమ వెంచర్లో కొనుగోలు చేసుకునే వారికి ఎలాంటి ఇబ్బందులు ఉండవు.


హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేస్తున్న అధికారులు

రెండో విడత 'తల్లికి వందనం'కు

8లోగా ఆధార్ అనుసంధానం చేయాలి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

తల్లికి వందనం పథకం రెండో విడతకు సంబంధించి ఒకటో తరగతి, జూనియర్ ఇంటర్ చదివే విద్యార్థుల నిధులు మంజూరు అయినట్లు సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎన్.లక్ష్మా నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కు చెందిన ఎస్సీ విద్యార్థులు, తల్లులు తమ ఆధార్ నంబర్లు వారి బ్యాంకు ఖాతాలకు 8వ తేదీ లోపుగా అనుసంధానం చేయాలని ఆయన పేర్కొన్నారు. ఒకటో తరగతి చదివే షెడ్యూల్ కులాల విద్యార్థులకు వారి తల్లుల ఖాతాలకు, జూనియర్ ఇంటర్ చదువుతున్న ఎస్సీ విద్యార్థులకు విద్యార్థుల ఖాతాల్లో జమ చేస్తారని తెలిపారు. దీనికి సంబంధించి వారి ఆధార్ నంబర్లను బ్యాంకు ఖాతాలకు అనుసంధానం చేసుకోవాలని ఆయన తెలిపారు. ఆధార్ నెంబర్ బ్యాంకు ఖాతాకు అనుసంధానం చేసిన కాపీని గ్రామ, వార్డు సచివాలయంలోని వెల్ఫేర్, ఎడ్యుకేషనల్ అసిస్టెంట్, వార్డు ఎడ్యుకేషన్ డాటా ప్రాసెసింగ్ సెక్రటరీకి అందజేసి యూపీసీఐ పోర్టల్‌లో అనుసంధానం చేసుకోవాలని సూచించారు. ఆధార్ నెంబర్ బ్యాంకు ఖాతాకు అనుసంధానం కాని విద్యార్థులు పోస్టల్ కార్యాలయంలో బ్యాంకు ఖాతా తెరిచి ఎన్పీసీఐ పోర్టల్‌లో అనుసంధానం చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 8వ తేదీలోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.

రైతన్న క్షేమం కోరి..

- ఎమ్మెల్యే ఉగ్ర చొరవతో రూపుదాల్చిన రైతుబజార్ నిర్మాణం
- దళారీ వ్యవస్థ లేకుండా ప్రయోజనం పొందనున్న రైతులు
- ప్రారంభానికి సిద్ధమైన కనిగిరి రైతు బజార్

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి ప్రాంతంలోని రైతుల కష్టాలు తెలుసుకున్న కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి వారి కష్టాలు తీరేలా కనిగిరిలో నియోజకవర్గ స్థాయిలో రైతుబజార్ ప్రారంభానికి సిద్ధమైంది. మూడు సంవత్స రాల క్రితం గత ప్రభుత్వంలో మంజూరైన రైతుబజార్ ప్రభుత్వ, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా నిర్మాణం రూపుదాల్చుకోకుండా పోయింది. ఏడాది క్రితం అధికారంలోకి కూటమి ప్రభుత్వం రాగా కనిగిరి ఎమ్మెల్యేగా ఎన్నికైన డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి వెలాగైనా రైతుబజార్ నిర్మాణం పూర్తి చేసి రైతులకు, వినియోగదారులకు ప్రయోజనం కలిగేలా చూడాలని ఆకాంక్షించారు. రైతుబజార్ నిర్మాణం చేపట్టేలా అనుమతులు తీసుకొచ్చారు. సుందరంగా రైతు బజార్ రూపుదిద్దుకొంది. 7 రూములు 30 స్టాల్స్ ఏర్పాటు చేసేలా నిర్మాణ పనులు జరిగాయి. త్వరలో రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి కింజరపు అచ్చయ్య నాయుడు చేతుల మీదుగా ఈ రైతు బజార్‌ను ప్రారంభించేందుకు ఎమ్మెల్యే ఉగ్ర సన్నాహాలు చేస్తున్నారు.



ప్రారంభానికి సిద్ధమైన కనిగిరి రైతు బజార్


నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర

దళారీ వ్యవస్థను నిర్మూలించేందుకు కృషి

గంగవరపు నాగిరెడ్డి, టిడిపి నాయకులు, కనిగిరి



దళారీ వ్యవస్థ లేకుండా రైతులు నేరుగా తమ వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించుకుని ఆర్థికంగా స్థిరపడేందుకు రైతు బజార్ అవసరమని గుర్తించి రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి కషి చేశారు. రైతు బజార్ అందుబాటులోకి రావడంతో రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

వినియోగదారులకూ ప్రయోజనం

నారపరెడ్డి శ్రీనివాసరెడ్డి, టిడిపి నాయకులు, కనిగిరి



కనిగిరిలో రైతు బజార్ నిర్మాణం చేపట్టడం వల్ల రైతులతో పాటు వినియోగదారులకూ ప్రయోజనం కలగనుంది. దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా రైతుల వద్ద నుంచి పంట ఉత్పత్తులను వినియోగదారులు తక్కువ ధరలకు కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది. రైతుకు, వినియోగదారునికి ప్రయోజనం కలిగేలా రైతుబజార్ ఏర్పాటుకు ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి కృషి చేయడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

ప్రారంభానికి సిద్ధం

రవిచంద్ర, ఏఎంసి సెక్రటరీ, కనిగిరి



గత ప్రభుత్వం హయాంలో మూడు సంవత్సరాల క్రితం రైతుబజార్ మంజూరయింది. కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడంతో నిర్మాణం జరగలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ప్రత్యేక చొరవ చూపి తిరిగి మంజూరు చేయించి నిర్మాణం పనులను చురుగ్గా సాగేలా కృషి చేశారు. ఫలితంగా రైతు బజార్ నిర్మాణ పనులు పూర్తిచేసుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉంది.

రైతులకు ప్రయోజనం చేకూర్చడమే లక్ష్యం

బాలు ఓబుల్‌రెడ్డి, టిడిపి నాయకులు, కనిగిరి



రైతులకు ప్రయోజనం చేకూర్చడమే లక్ష్యంగా పెట్టుకొని రైతు బజార్‌ను కనిగిరిలో నిర్మించేందుకు ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి కషి చేశారు. ఫలితంగా రైతు బజార్ రూపుదిద్దుకొంది.

ఒంగోలు ఎలైట్ సిటిజన్స్ కమిటీ ఏకగ్రీవం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు ఎలైట్ సిటి జన్స్ 2025-26 సంవత్సరానికి కొత్త అధ్య క్షునిగా గ్రంధి పార్థసారథి, ప్రధాన కార్యదర్శిగా బొమ్మిశెట్టి లక్ష్మణస్వామి, కోశాధికారిగా పద్మ నాభుని నందకుమార్ ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. నగరంలోని హెూటల్ వర్మ గ్రాండ్‌లో కార్యవర్గ ఎన్నిక ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా క్లబ్ ఫౌండర్ కూరపాటి రమేష్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు ఎలైట్ సిటిజన్స్ సమాజ హితానికి మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. క్లబ్ అన్ని విభాగాలలో ముందంజ వేయాలని ఆకాంక్షించారు. అనంతరం నూతన కమిటీని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ పూర్వాధ్యక్షులు గోపాలకష్ణ, తమ్మన ఆంజనేయులు, పబ్బిశెట్టి జనార్ధన్, తాత అశోక్, పోకూరి నవీన్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.


నూతన కమిటీని ఘనంగా సత్కరిస్తున్న దృశ్యం

సూర్యలంక బీచ్‌లో పర్యాటకుల సందడి



సూర్యలంకలో చిన్నారులతో సందడి

ప్రజాశక్తి - బాపట్ల

సూర్యలంక సముద్రతీరంలో పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం సెలవు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుండి పర్యాటకులు సూర్యాలంక బీచ్ సందర్శించి సముద్ర స్థానాలు చేశారు. చిన్నారులతో పర్యాటకులు బీచ్‌లో సందడి చేశారు. హైదరాబాద్‌కు చెందిన పలువురు బీచ్ సువిశాలంగా అందంగా ఉందని పేర్కొన్నారు. ఇంకా మెరుగైన సౌకర్యాలు కల్పిస్తే ఇంకా బాగుంటుందని అన్నారు. హైదరాబాద్‌కు దగ్గరలో సూర్యలంక బీచ్ మాత్రమే ఉండడంతో పర్యాటకులు హైదరాబాదు, తెలంగాణ ప్రాంతం నుండి అధిక సంఖ్యలో ఇక్కడికి వస్తున్నారు. అందుకు తగ్గట్టుగా ఇక్కడ ప్రభుత్వం ప్రత్యేక వసతి సౌకర్యాలు కల్పిస్తే బాగుంటుందని అన్నారు. ఇక్కడ పర్యాటక శాఖకు చెందిన రిసార్ట్స్ ఉన్నాయి. వాటిని ఆన్లైన్లో బుక్ చేసుకోవాల్సి వస్తుంది. అప్పటికప్పుడు సూర్యలంక బీచ్ సందర్శిద్దామని వచ్చే వారికి వసతి సౌకర్యం ఇబ్బందికరంగా ఉంటుంది. ఈ సమస్యను తీర్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టి అందరికీ సౌకర్యవంతంగా ఉండే విధంగా వసతి సౌకర్యాలు కల్పించాలని పర్యాటకులు కోరుతున్నారు. పోలీసులు ఎన్ని భద్రతా చర్యలు చేపట్టినప్పటికీ యువకులు సముద్రంలో స్నానాలు చేస్తూ అలల్లో కొట్టుకుపోతున్న పరిస్థితి జరుగుతూనే ఉంది. తాజాగా ఆదివారం సముద్రం అలల్లో కొట్టుకుపోతున్న గుంటూరుకు చెందిన ఓ యువకుడిని పోలీసులు కాపాడారు. సముద్ర స్నానలాచరిస్తున్న పర్యాటకులకు ఎప్పటికప్పుడు ప్రమాదాల నివారణ సూచనలు చేస్తూ పోలీసులు గట్టి భద్రతా చర్యలు చేపట్టారు. సముద్రంలో స్నానాలు చేసే సమయంలో యువకులు లోతుకు వెళ్ళకండి, లోతుకి వెళ్లి ప్రాణాలు మీదకు తెచ్చుకోవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు.



బీచ్‌లో తెలంగాణ పర్యాటకుల దృశ్యాలు

పంచాయతీ కార్యదర్శులపై పనిభారం తగ్గించాలి



మాట్లాడుతున్న జిల్లా నాయకులు పల్నాటి శ్రీరాములు

ప్రజాశక్తి - బాపట్ల

పంచాయతీ కార్యదర్శులపై పని భరం తగ్గించాలని పంచాయతీ కార్యదర్శుల సంఘం సీనియర్ నాయకులు పల్నాటి శ్రీరాములు కోరారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఆదివారం జరిగిన పంచాయతీ కార్యదర్శుల జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీల్లో పారిశుధ్య పనుల నిర్వహణలో కార్యదర్శులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. పారిశుధ్య నిర్వహణకు అవసరం మేరకు నిధులు లేకపోవడంతో పారిశుధ్య పనుల్లో కీలక పాత్ర పోషించే క్లాప్ మిత్రలకు ఇచ్చే వేతనం రూ.6వేలు చాలడం లేదని, దీంతో పారిశుద్య కార్మికులు పనులకు ముందుకు రావడం లేదని అన్నారు. ప్రభుత్వమే నెలకు రూ.10వేల చొప్పున నేరుగా చెల్లించాలని కోరారు. ప్రస్తుతం పాత రిక్షాల స్థానంలో ఇ – ఆటోలు, ట్రాక్టర్లు మంజూరు చేయాలని అన్నారు. పంచాయతీ కార్యదర్శిని పంచాయతీ విధులకు మాత్రమే పరిమితం చేసి సచివాలయ డిడిఒ బాధ్యతల నుంచి తొలగించాలని కోరారు. అన్ని ప్రభుత్వ శాఖల సర్వేలను చేయించే బాధ్యత ఒక పంచాయతీ కార్యదర్శికి మాత్రమే అప్పగించడంతో కార్యదర్శులు పని ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు. ఐవిఆర్ఎస్ ఫోన్ కాల్స్ ద్వారా పంచాయతీ కార్యదర్శుల పనితీరు అంచనా వేయడం సమంజసం కాదని, నిరంతరం కొనసాగే చెత్త సేకరణ ప్రక్రియలో పారిశుధ్యం లోపించిందనే పేరుతో ఉన్నతాధికారులు పంచాయతీ కార్యదర్శులపై సస్పెన్షన్ వంటి చర్యలు తీసుకోవడం అన్యాయమని అన్నారు. ఇందులో భాగంగా వేటపాలెం మండలం పుల్లరిపాలెం పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేశారని, ఆ సస్పెన్షన్ ఉత్తర్వులు వెంటనే ఉపసంహరించుకోవాలని పంచాయతీ కార్యదర్శుల సంఘం డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా కమిటీ ఏర్పాటు చేసేందుకు 25 మండలాల నుంచి ఒక్కొక్క ప్రతినిధిని ఎన్నుకున్నారు. సమావేశంలో కార్యదర్శులు డి మురళి బాపూజీ, డి సుజాత, ఎం శ్రీనివాసరావు, షేక్ జిలాని, తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన వివిధ పంచాయితీల కార్యదర్శులు

ప్రకృతి ప్రేమికుడు సిఐ ప్రభాకర్‌రావు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్ ప్రభాకరరావు ప్రకృతి ప్రేమికుడిగా అందరి మన్ననలూ చూరగొంటున్నారు. సాధారణంగా పోలీస్ స్టేషన్ అనగానే మానసిక ఒత్తిడిని కలిగించే శూన్య వాతావరణం గుర్తుకొస్తుంది. కానీ యర్రగొండపాలెం పోలీస్ స్టేషన్ మాత్రం ఈ అపోహను పూర్తిగా తొలగిస్తోంది. అక్కడ అడుగు పెట్టగానే పచ్చదనం, పక్షుల గలగలలు, కుందేళ్లు, బాతుల తళతళలు ఇవన్నీ కలసి ఒక ఉద్యానవనాన్ని తలపించేలా చేస్తాయి. ఈ అద్భుతమైన మార్పుకు నేపథ్యం సీఐ ప్రభాకర్ రావు అసాధారణ దక్పథమే.



పోలీస్ స్టేషన్‌లో కుందేళ్లకు ఆహారం అందిస్తున్న సిఐ ప్రభాకర్‌రావు

ప్రకృతి వనంగా తీర్చిదిద్ది..

విధుల్ని నిర్వర్తిస్తూ యర్రగొండపాలెం ఎస్సై పి చౌడయ్యతో పాటు పోలీసుల సహకారంతో స్టేషన్ పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దారు. దీనికోసం ప్రతిరోజూ సమయం కేటాయించి మొక్కల్ని నాటడం, వాటికి నీరు పోసి వాటి పెంపకాన్ని పర్యవేక్షించడం మొదలైన కార్యక్రమాల్లో సిఐ ప్రభాకరరావు స్వయంగా పాల్గొంటున్నారు. మొక్కలు గుబురుగా పెరిగితే వాటిని సమతుల్యంగా కట్ చేయించి, అణకువగా పెరిగేలా చూసుకుంటున్నారు.

ప్రాణుల పట్ల అపారమైన ప్రేమ..

మొక్కలతో పాటు పక్షులు, కుందేళ్లు, బాతులు వంటి జంతువులకు కూడా ఒక కొత్త జీవన వాతావరణాన్ని సష్టించారు సీఐ ప్రభాకర్ రావు. పంజరాలలో కాకుండా స్వేచ్ఛగా సంచరించేలా వీటికి పూర్తి స్వాతంత్ర్యం కల్పించారు. ప్రతిరోజూ వాటిని పరిశీలిస్తూ, ఏదైనా ఆరోగ్య సమస్య వస్తే వెంటనే పశువైద్యుడిని పిలిపించి చికిత్స కల్పిస్తున్నారు. వీటికి తగిన ఆహారం అందించడమే కాదు విశ్రాంతి కోసం చిన్న చిన్న గదులు నిర్మించి వాటికి రాత్రివేళల్లో నిశ్శబ్దంగా విశ్రాంతి తీసుకునే అవకాశాన్ని కల్పించారు. సిఐ ప్రభాకర్ రావు ఆచరణను చూసిన ప్రతి ఒక్కరూ ఆయనను అభినందిస్తున్నారు.

సబ్సిడీపై పశువుల దాణా

ప్రజాశక్తి - పంగులూరు



డాక్టర్ మురళీకృష్ణ

పశు పోషకులకు 50 శాతం సబ్సిడీపై పశువుల దాణ ఇస్తున్న ట్లు ఇన్చార్జ్ పశు వైద్యాధికారి డాక్టర్ ఎం మురళీకృష్ణ చెప్పారు. ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడు తూ 50కేజీల పశువుల దాణ బయటి మార్కెట్లో రూ.1,110 ఉందని దానిని 50శాతం సబ్సిడీతో రూ.555లకు ఇస్తున్నామని తెలిపారు. ఇది పశువులకు ఎంతో ఆరోగ్యం, బలం ఇస్తుందని తెలిపారు. 90 శాతం సబ్సిడీతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా గోకులం షెడ్లు ఇస్తున్నట్లు తెలిపారు. రెండు గేదులు, 4 గేదెలు, 6 గేదెలు ఉన్నవారికి విడివిడిగా నిధులు ఇస్తారని తెలిపారు. 70శాతం సబ్సిడీతో గొర్రెలు, మేకలకు కూడా షెడ్లు వేసుకునేందుకు నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. గొర్రెలు, మేకలకు నోటి సొంగ (బ్లూ టంగ్) వ్యాధి వచ్చే అవకాశం ఉందని, వెంటనే వాటిని దగ్గరలోని పశు వైద్యశాలకు తీసుకెళ్లి వైద్యం చేయించుకోవాలని కోరారు. ప్రస్తుతం గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు వేస్తున్నామని అన్నారు. ఇంతకు ముందు గేదెలకు ఆడ దూడలు పుట్టేందుకు ఎస్ఎస్ఎస్ మందు ఒక్కో దూడకు రూ.500లకు వేసేవారిమని, ఇప్పుడు జూలై 1 నుండి దానిని తగ్గించి రూ.150కే వేస్తున్నట్లు చెప్పారు. పశువులు, గొర్రెలు, మేకలకు బీమా సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భీమా చేసిన తర్వాత మూడేళ్ల వరకు వర్తిస్తుందని తెలిపారు.



రోటరీ పాలకవర్గాన్ని సత్కరిస్తున్న దృశ్యం

'రోటరీ' కార్యవర్గానికి అభినందన

ప్రజాశక్తి - అద్దంకి

స్థానిక రామ సుశీల నిలయంలో రోటరీ కార్యవర్గానికి అభినందన సభ ఘనంగా నిర్వహించారు. సభలో వీరవల్లి సుబ్బారావు (రుద్రయ్య), రోటరీ నూతన అధ్యక్షులు పూర్ణచంద్రరావు,సెక్రటరీ అళహరి హరిప్రసాదు, ట్రెజరర్ గురుశేఖర్ పాల్గొని పాత కార్యవర్గం అధ్యక్ష, కార్యదర్శులు చప్పిడి వీరయ్య, చుండూరి మురళీ సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, అసిస్టెంట్ గవర్నర్ షేక్ మహమ్మద్ రఫీలను సత్కరించారు. వారు గతేడాదిలో చేసిన సేవా కార్యక్రమాలు ప్రశంసించారు. కార్యక్రమంలో డాక్టర్ దేవపాలన, సందిరెడ్డి శ్రీనివాసరావు, విద్వాన్ జ్యోతి చంద్ర మౌళి, పిఎల్‌వి నరసింహారావు, మన్నం త్రిమూర్తులు, అద్దంకి లేవి ప్రసాద్, పి ఉదయ భాస్కర్, పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి, అన్నంగి సుబ్బారావు, సంకా బాబు, సయ్యద్ మౌలాలి, కొల్లా భువనేశ్వరి, అంజాద్ భాషా, పువ్వాడ, ఊటుకూరు రామకోటేశ్వరావు పాల్గొన్నారు.



అలల్లో కొట్టుకుపోతున్న యువకుడు

యువకుడిని కాపాడిన పోలీసులు

ప్రజాశక్తి - బాపట్ల

సూర్యలంక బీచ్‌లో సముద్ర స్నానం చేస్తూ అలలు తాకిడికి కొట్టుకుపోతున్న ఓ యువకుడిని పోలీసులు, గజ ఈతగాళ్లు ఆదివారం కాపాడారు. గుంటూరు ప్రగతి నగర్‌కు చెందిన 20 ఏళ్ల ఉదయ్ రాజు స్నేహితులతో కలిసి సూర్యలంక బీచ్‌కు సముద్ర స్నానానికి వచ్చారు. సముద్రంలో స్నానం చేస్తున్న సమయంలో ఒక్కసారిగా వచ్చిన అలల ధాటికి సముద్రంలోకి కొట్టుకుపోతూ కేకలు వేయడంతో సూర్యలంక అవుట్ పోస్టులో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ ఎం పోతురాజు, విక్టర్, గజ ఈతగాళ్లు అప్రమత్తమై అలల్లో కొట్టుకుపోతున్న యువకుడిని కాపాడి ఒడ్డుకు చేర్చారు. 108 ద్వారా బాపట్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. యువకుడిన కాపాడిన వారిలో పోలీసులతోపాటు గజ ఈతగాళ్లు సుందరయ్య, రామయ్య, నాగేశ్వరావు, మీరా సాయిబు, దుర్గ, కార్తీక్, బాలు, హెూమ్ గార్డ్ నరసింహ మూర్తి ఉన్నారు.



బీరువ బహుకరిస్తున్న రోటరీ ప్రతినిధులు

దేవస్థానంకు బీరువా బహూకరణ

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని చెరువు కొమ్ముపాలెం గ్రామదేవత శ్రీ అంకమ్మ తల్లి దేవస్థానంకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రోటరీ మాజీ ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు సౌజన్యంతో ఇనుప బీరువా తొలి ఏకాదశి సందర్భంగా అందచేశారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు బాచిన శివధర పూర్ణ చంద్రరావు, సెక్రటరీ అళహరి హరి ప్రసాద్, ట్రెజరర్ గురుశేఖర్, మలాది శ్రీనివాసరావు, సందిరెడ్డి శ్రీనివాసరావు, డాక్టర్ ఉబ్బా దేవపాలన, పువ్వాడ రామకోటేశ్వరావు, కొల్లా భువనేశ్వరి, తమ్మన శ్రీనివాసరావు, అన్నంగి సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
సోమవారం 7 జులై 2025

మురుగు కాలువలు బాగుపడేదెప్పుడు?



వెల్లటూరులో నిర్మాణంలో ఉన్న సాగునీటి కాలువ వంతెన

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఈ ఏడాది కూటమి ప్రభుత్వ పాలనలో నీటి సంఘాలను ఏర్పాటు చేసి వాటి ద్వారా సాగునీటి కాలువల పూడిక తీత చేపట్టి అభివృద్ధి చేస్తున్నారు. అంతవరకు రైతులు హర్షించదగిన విషయమే. కానీ అదే రీతిలో అంతకంటే ప్రధానమైన మురికి కాలువలను కూడా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అధిక వర్షాల సమయంలో వర్షపు నీరు బయటకు వెళ్లి పంటలను కాపాడేది మురుగు కాలువలే. అలాంటి ప్రధానమైన మురుగు కాలువల అభివృద్ధిపై అధికారులు, నీటి సంఘాలు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. భట్టిప్రోలులోని అద్దేపల్లి నుండి ప్రారంభమైన కనగాల అప్లుయెంట్ మురుగు కాలువలో గుర్రపు డెక్క పెరిగిపోయి రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తుంది. నీటి సంఘాలు ఇప్పటివరకు గుర్రపు డెక్క చనిపోవటానికి మందులు కూడా పిచికారి చేయలేదు. ఎక్కడికి అక్కడ సాగునీటి కాలువలను జెసిబిలతో అభివృద్ధి పరుస్తున్నారేతప్ప ఇలాంటి ప్రధానమైన మురుగునీటి కాలువలపై ఎందుకు దృష్టి సారించడం లేదని రైతుల ప్రశ్నిస్తున్నారు. గతేడాది కురిసిన అధిక వర్షాలకు ఈ మురుగ కాలువ ప్రాంతంలో ఉన్న వేలాది ఎకరాలు పూర్తిగా నీట మునిగి దెబ్బ తిన్నాయి. రూ.కోట్లలో రైతులు నష్టపోయారు. వ్యవసాయ రంగానికి సాగునీటి కాలువలు ఎంత ప్రధానమో అంతకంటే ఎక్కువగా మురుగు నీటి పారుదల సౌకర్యం కూడా ప్రధానమైంది. సాగునీరు, మురుగు నీటి కాలువల అభివృద్ధికి ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించింది. ఆ నిధులతో చేపట్టిన పనులు నామమాత్రంగానే ఉన్నాయి. కాల్వ పనులు చేపట్టే ప్రాంతంలో నీటి సంఘాల నాయకులు తప్ప ఏ ఒక్క అధికారి కనిపించకపోవడం గమనార్హం. గత ప్రభుత్వ పాలనలో కాలువలు పూడిపోయి ఎలాంటి అభివృద్ధి పనులకు నోచుకోలేదు. కూటమి ప్రభుత్వంలో కాలువల అభివృద్ధి పనులు చేపట్టటం పట్ల రైతులు హర్షం చేస్తున్నారు. అయితే అదే రీతిలో ఇప్పటివరకు పట్టించుకోని మురుగు కాలువలను కూడా అభివృద్ధి పరిచేందుకు చర్యలు చేపట్టి రైతులకు గత అనుభవాలు ఎదురు కాకుండా చూడాలని కోరుతున్నారు.



కనగాల అప్లోయెంట్ కాలువలో పెరిగిన గుర్రపు డెక్క



ఎన్నికైన డివైఎఫ్ఐ నూతన కార్యవర్గంతో రాష్ట్ర కార్యదర్శి జి రామన్న

డివైఎఫ్ఐ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - రేపల్లె

నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని, నిరుద్యోగ భృతి ఇవ్వాలని, తీర ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి రామన్న డిమాండ్ చేశారు. 10మందితో నూతన కమిటీ ఎన్నుకున్నారు. డివైఎఫ్ఐ ప్రాంతీయ కమిటీ కార్యదర్శి కెవి లక్ష్మణరావు, అధ్యక్షులు సిహెచ్ ప్రకాష్, ఉపాధ్యక్షులు ఎ రత్నాకర్, వై నవీన్, ఎం సూర్య, వై బాల నాగులు, సహాయ కార్యదర్శిలు హేమ నాగ శ్రీ, వాసు, బి రామాంజనేయులు, ఎన్ శివశంకర్ ఎన్నికయ్యారు. డివైఎఫ్ఐ నియోజకవర్గం విస్తృతస్థాయి సమావేశం స్థానిక విశ్వ కాలేజీలో ఆదివారం నిర్వహించారు. సమాజంలో యువత ప్రాధాన్యత చాలా కీలకమైనదని అన్నారు. యువత సమస్యలపై డివైఎఫ్ఐ దేశ వ్యాప్తంగా అనేక పోరాటాలు చేస్తుందని చెప్పారు. అందరికీ విద్య, అందరికీ ఉపాధి లక్ష్యాలతో ఏర్పడిన డివైఎఫ్ఐ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ఉపాధి కల్పించాలని, యువత సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తున్నదని చెప్పారు. ఖాళీ పోస్టులు భర్తీచేయాలని, రేపల్లె వంటి తీర ప్రాంతంలో ఆక్వా పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారా ఉపాధి కల్పించాలని కోరారు. ఎన్నికల హామీల్లో భాగంగా ఇస్తామన్న నిరుద్యోగ భృతిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా వరదల సమయంలో రోజుల తరబడి సేవ చేయటం, ఆహార కేంద్రాల నడపటం, రక్తదాన శిబిరాలు నడపటం, యువత చెడు మార్గంలో నడవకుండా మద్యం, మాదక ద్రవ్యాలు వంటి వాటి నుండి దూరం చేసే విధంగా అనేక కార్యక్రమాలు చేస్తున్నామని అన్నారు. సమావేశంలో మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు సిహెచ్ మణిలాల్, కె రవితేజ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇయు రాష్ట్ర అధ్యక్షులు దామోదరరావు

'విరమణ' ప్రయోజనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - బాపట్ల

ఆర్టీసీ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ అనంతరం ప్రభుత్వం నుండి రావలసిన ఆర్థిక ప్రయోజనాలు అన్నీ తక్షణమే అందజేసే విధంగా కృషి చేస్తానని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు అమరావతి ఎపిజెఎసి ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు కోరారు. ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి వైఎస్ రావు ఉద్యోగ విరమణ సందర్భంగా ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో ఆదివారం జరిగిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం కాకముందు కార్పొరేషన్‌గా ఉన్న కాలంలో ఆర్టీసీలో పనిచేసి ఉద్యోగ విరమణ రోజే ఆ ఉద్యోగికి అందాల్సిన ఆర్థిక ప్రయోజనాలు చెక్కు రూపంలో అందజేసే వారని అన్నారు. ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనమైన తర్వాత ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగికి ఆర్థిక, ఇతర ప్రయోజనాలు పొందడానికి నెలల సమయం పడుతుందని అన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రయాణికుల సంఖ్య పెరుగుతూనే ఉందని అన్నారు. ప్రయాణికుల ప్రయాణ అవసరాలు తీర్చేందుకు ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచాల్సిన అవసరాన్ని ప్రభుత్వం గుర్తించాలని అన్నారు. ఉద్యోగుల నియామకాన్ని కొనసాగించి ఆర్టీసీలో అవసరమైన ఉద్యోగులను నియమించాలని అన్నారు. అందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ బాపట్ల డిపో మేనేజర్ బి శ్రీమన్నారాయణ, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు బిటి వలి, వైఎస్ రావు కుటుంబ సభ్యులు, ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం అహర్నిశలూ కృషి

ప్రజాశక్తి - చీరాల

నియోజకవర్గ అభివృద్ధికి శాసన సభ్యులు ఎంఎం కొండయ్య అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలుగు యువత నాయకులు మద్దులూరి గౌరీ అమర్నాద్ అన్నారు. ప్రజల సంక్షేమానికి ఎల్లప్పుడూ తోడుంటూ ప్రజల అవస రాలు గుర్తించి అండగా ఉంటున్నారని అన్నా రు. పట్టణంలోని మహాత్మా గాంధీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన స్వయం ఉపాధి కల్పన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా చంద్రబాబు ప్రభుత్వం పి4 పథకం అమలు చేస్తోందని అన్నారు. మహిళలు కూడా ఆత్మనిబ్బరంగా నిలబడేలా కార్యక్రమాలు తీసుకొస్తున్నట్లు తెలిపారు. స్వయం ఉపాధి ద్వారా మాత్రమే అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఏ సహాయం కావాలన్నా నేరుగా ఎమ్మెల్యే కొండయ్యను కలిసి చెప్పాలని కోరారు. ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరికి అందేలా నాయకులు, అధికారులు కృషి చేస్తున్నారని చెప్పారు. అనంతరం ఉపాధి అవకాశాలపై జాగ్రత్తలు, దరఖాస్తు విధానాలపై సొసైటీ ప్రతినిధులు వివరించారు. కార్యక్రమంలో మహాత్మా గాంధీ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



గాంధీ వెల్ఫేర్ సొసైటీ ప్రతి నిధులతో అమర్నాథ్

ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలి

ప్రజాశక్తి - అద్దంకి

ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్సులు పొంది ఉండాలని, ప్రస్తుతం ఆన్లైన్లో రవాణా శాఖకు సంబంధించిన అనేక సేవలు అందుబాటులో ఉన్నాయని ఆర్‌టిఒ కృష్ణ పరందామరెడ్డి అన్నారు. సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. అద్దంకిలో శాశ్విత ఆర్టిఒ కార్యాలయం ఏర్పాటు అవసరమని అన్నారు. ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉనన సేవలు ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. వాహన ఆర్సీ కార్డులు అవసరమైన వారికే అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రస్తుతం అవసరం లేని వారికి వాహనాలు రిజిస్ట్రేషన్ సమయంలో దానికి సంబంధించిన చార్జీలు వసూలు చేయటం లేదని అన్నారు. పోలీసులు వాహనాలు తనిఖీ చేసే సమయంలో ఆర్‌సి కార్డులు చూపమని అడిగితే ఆన్లైన్లో తెలుసుకోవాల్సిందిగా తెలపాలని వాహనదారులకు తెలిపారు. ఈపాటికే సంబంధిత పోలీసు శాఖకు ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న ఆర్‌టిఒ కృష్ణ పరంధామరెడ్డి

బాలుడిపై కుక్క దాడి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్



గాయపడ్డ బాలుడు

బాలునిపై కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన మండల పరిధిలోని ద్రోణాదుల గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. 108 సిబ్బంది మనోహర్, సురేష్ తెలిపిన వివరాలు ప్రకారం ద్రోణాజులలోని సుగాలి కాలనీకి చెందిన 2ఏళ్ల బాణావత్ లక్ష్మి కుమార్ ఇంటి ముందు ఆడుకుంటుండగా కుక్క ఒక్క సారిగా దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది తొలుత మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు సర్వజన సమగ్ర వైద్యశాలకు తరలించారు.



రోటరీ భవన్లో ఉచిత శిక్షణలో పాల్గొన్న రోటరీ ప్రతినిధులు

రోటరీ ప్రతినిధులకు శిక్షణ

ప్రజాశక్తి - పర్చూరు

రోటరీ ఆధ్వర్యంలో సమీప రోటరీ క్లబ్లులైన చీరాల, వేటపాలెం, బాపట్ల, పర్చూరు, ఇంకొల్లు, పంగులూరు, క్షీరపురి చీరాల క్లబ్బుల కార్య నిర్వాహకులకు ఒకరోజు శిక్షణ శిబిరాన్ని స్థానిక రోటరీ భవన్లో పర్చూరు క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ ఆధ్వర్యంలో సహాయ గవర్నర్ నాగబైరు శ్రీనివాసరావు నిర్వహించారు. రాబోవు 2025-26 సంవత్సరానికి నిర్దేశించిన ప్రణాళికలను తెలియచేశారు. అనుసరించాల్సిన విధానాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంనకు రోటరీ జిల్లా 3150 నుండి పాస్ట్ డిస్టిక్ గవర్నర్ అన్నే రత్న ప్రభాకర్, కెఎస్ఆర్‌కె ప్రసాద్, జెవి మోహనరావు, చిలుకూరి శ్రీనివాసరావు, అనిల్ చక్రవర్తి, పంగులూరి విష్ణు బాబు, పర్చూరు క్లబ్ సభ్యులు కోమటి ఆంజనేయులు, పంబి సదానందరెడ్డి, కొల్లానరేంద్ర కుమార్, పాబోలు ఉదయ్ భాస్కర్, కోట శ్రీనివాసరావు, మున్నంగి వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.



కుక్కలకు ఉచితంగా టీకాలు వేస్తున్న దృశ్యం

ఉచితంగా రేబిస్ టీకాలు

ప్రజాశక్తి - అద్దంకి

పశువుల నుండి మనుషులకు, మనుషుల నుండి పశువులకు సంక్రమించే వ్యాధులను జూనోటిక్ వ్యాధులు అంటారని పశు వైద్యశాల సహాయ సంచాలకులు కెవి బ్రహ్మయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూనోటిక్ వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకోవడానికి డాక్టర్ లూయిస్ పాశ్చర్ అనే సైంటిస్ట్ చేసిన కృషిని గౌరవిస్తూ ప్రతి ఏటా జూలై నెల 6న ప్రపంచ వ్యాప్తంగా జూనోసిస్ డే జరుపుకుంటారని చెప్పారు. మొదటిగా 1885 జూలై 6న రేబిస్ వ్యాధి టీకా కనుగొని విజయవంతంగా పెంపుడు కుక్కలకు వేశారని చెప్పారు. కార్యక్రమంలో పశు పోషకలతో పాటు పెంపుడు కుక్కల యజమానులు పాల్గొన్నారు.

13న ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - ఇంకొల్లు

మండలంలోని గంగవరం మంచాల వెంకటరామయ్య, రంగమ్మ విద్యా, వైజ్ఞానిక కళ్యాణ మండపంలో ప్రతి 2 నెలలకు ఒకసారి నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్ కరి బాలచంద్ర తెలిపారు. ప్రముఖ షుగర్ వైద్య నిపుణులు డాక్టర్ మంచాల రమేష్, స్థానిక వైద్యాన్నిపుణులు డాక్టర్ సాంబయ్య వైద్య పరీక్షలు చేస్తారని తెలిపారు. గతంలో మాదిరి ఉచితంగా షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి ఉచితంగా అవసరమైన రెండు నెలలకు సరిపడా మందులు అందజేయున్నట్లు తెలిపారు.

పెంపుడు జంతువులకు వ్యాక్సిన్ వేయించాలి

- ఎమ్మెల్యే దామచర్ల
- ఘనంగా ప్రపంచ జూనోసిస్ డే


వ్యాక్సిన్ వేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పెంపుడు జంతువుల నుండి మనుషులకు వ్యాధులు రాకుండా ఉండాలంటే వాటికి క్రమం తప్పకుండా వ్యాక్సిన్ వేయించాలని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన రావు సూచించారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఒంగోలు సంతపేట పశువుల ఆసుపత్రిలో పెంపుడు కుక్కలకు ఎమ్మెల్యే దామచర్ల వ్యాక్సిన్ చేశారు. జూనోసిస్ డేకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి.రవి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ పెంపుడు కుక్కలను ప్రతి ఒక్కరూ ప్రేమగా పెంచుకుంటారని, అదే సమయంలో వాటికి సకాలంలో వ్యాక్సిన్లు వేయించాలని సూచించారు. వాటికి వ్యాక్సిన్ చేయించడం ద్వారా వాటి ద్వారా మనుషులకు వ్యాధులు రావన్నారు. ప్రతి ఒక్కరూ తమ పెంపుడు జంతువులకు వ్యాక్సిన్ వేయించాలని కోరారు. కార్యక్రమంలో ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత ప్రసంగించారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ షాలిని కుమారి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ వైష్ణవి, పెంపుడు జంతువుల యజమానులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి

ఎస్‌డబ్ల్యూఎఫ్ పిలుపు



మాట్లాడుతున్న అయ్యప్పరెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జులై జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ పిలుపునిచ్చింది. ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం నాడు ఒంగోలు డిపో వద్దగేట్ మీటింగ్ జరిగింది. ప్రకాశం రివిజినల్ నాయకులు ఎస్‌కె.మీరావలి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఎం.అయ్యప్పరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్ మార్చిన చట్టాన్ని రద్దు చేయాలని, విద్యుత్ బస్సులను ఆర్‌టిసికే ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం 10 గంటల పని జిఒ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిఒ 70, 71ల ద్వారా ఆర్‌టిసి కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2024 నుంచి రిటైర్డ్ అయిన కార్మికులకు టెర్మిన ల్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 12వ వేతన సంఘాన్ని నియమించాలని, 30 శాతం ఐఆర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల రక్షణ, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోట్లాది మంది పాల్గొంటున్న దేశవ్యాప్త సమ్మెలో ఆర్టీసీ కార్మికులు అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ గేట్ మీటింగ్‌లో ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాబూజగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి


బాబూజగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

చిన్ననాటి నుంచే సామాజిక న్యాయం కోసం పోరాడిన బాబూ జగజీవన్ రామ్ నేటి యువతకు మార్గదర్శకులని వైసిపి నేతలు పేర్కొన్నారు. బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో పలువురు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైసిపి నేతలు మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ ఉపప్రధానిగా, కేంద్ర మంత్రిగా సామాజిక న్యాయం కోసం, కార్మికుల సంక్షేమం కోసం చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చుండూరు రవి, పిడిసిసి బ్యాంక్ మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, మాజీ శాసన సభ్యులు కసుకుర్తి ఆదెన్న, పట్టణ అధ్యక్షులు శంకర్‌రావు, కార్పొరేటర్ ఇమ్రాన్‌ఖాన్ పాల్గొన్నారు.

నేడు మిగిలి ఉన్న సీట్లకు కౌన్సిలింగ్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 6, 7, 8, 9, తరగతులకు వివిధ పాఠశాలలో మిగిలి ఉన్న ఖాళీలకు సోమవారం నాడు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల కోఆర్డినేటర్ డి.జయ ఆదివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ తరగతుల్లో ప్రవేశానికి నిర్దేశించిన పరీక్ష (జూన్ 26 న దర్శి లో మరియు మార్కాపురంలో జరిగిన ప్రవేశ పరీక్ష) ఫలితాలు విడుదల అయినట్లు ఆమె పేర్కొన్నారు.అర్హత సాధించిన బాలికలకు సోమవారం నాడు ఉదయం 9 గంటలకు చీమకుర్తి గురుకులంలోను , బాలురకు మధ్యాహ్నం 1 గంటకు దర్శి గురుకులం లో కౌన్సిలింగ్ జరుగుతుందని తెలిపారు.

'అమ్మ' పేరుతో ఒక మొక్క

- 10న మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ 2.0
- కలెక్టర్ వెంకట మురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో ఈ నెల 10న జరగనున్న మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ 2.0 కార్యక్రమంలో భాగంగా అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటమురళి కోరారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలలో జులై 10న మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, ఎస్‌ఎమ్‌సి సభ్యులు, పూర్వ విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, స్థానిక సంస్థల సభ్యులు, విద్యాశాఖ అధికారులు పాల్గొననున్నారు. ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం తల్లిదండ్రులకు వారి పిల్లల విద్య, ఆరోగ్య పురోగతిపై పూర్తి అవగాహన కల్పించడంతో పాటు పాఠశాల అభివద్ధిలో వారిని భాగస్వామ్యులుగా చేయడం, తల్లిదండ్రులకు వారి పిల్లల యొక్క సామర్థ్యాలు ప్రవర్తన నడవడిక తదితర అంశాలను తెలియజేస్తూ తల్లిదండ్రులతో నేరుగా మాట్లాడటం కోసం మెగా పేటీఎం నిర్వహించడం జరుగుతోందన్నారు. విద్యార్థులు అందరూ నూతనంగా అందించిన పూర్తి యూనిఫామ్‌తో హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రులకు స్వాగతం పలకడం, తల్లిదండ్రులు పిల్లలతో తరగతులలో కూర్చోవడం, ఒకరితో ఒకరి చర్చ, ఆరోగ్య కార్డుపై చర్చ, వీడియోల ద్వారా విద్యాప్రసార కార్యక్రమం ఉంటాయన్నారు. అనంతరం తల్లిదండ్రుల పోటీలు రంగోలీ, మ్యూజికల్ చైర్స్, టగ్ ఆఫ్ వార్ తదితర పోటీలు ఉంటాయని తెలిపారు. తల్లికి వందనంపై నివేదిక, పాఠశాల అభివద్ధి నివేదిక, ఉత్తమ విద్యార్థుల ప్రసంగాలు, తల్లిదండ్రుల ఉపన్యాసాలు, పూర్వ విద్యార్థుల ప్రసంగాలు ఉంటాయన్నారు. 'నోడ్రగ్స్ బ్రో'పై విద్యార్థులకు అవగాహన, సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తారన్నారు. ప్రతి విద్యార్థీ తల్లి పేరుతో ఒక మొక్క నాటడం చేస్తారన్నారు. గ్రీన్ పాస్‌పోర్ట్ ప్రదానం, పర్యావరణ పరిరక్షణపై సందేశాలు, 'డొక్కా సీతమ్మ' పథకం మధ్యాహ్న భోజనం చేస్తారని చెప్పారు. రానున్న కాలంలో విద్యా వ్యవస్థకు ప్రాణం పోసే విధంగా, తల్లిదండ్రుల భాగస్వామ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ ఈ కార్యక్రమాన్ని రూపకల్పన చేశారని, పై కార్యక్రమాన్ని అత్యంత ప్రధానమైన బాధ్యతగా గుర్తించి కార్యక్రమం విజయవంతం కావటానికి తగిన ఏర్పాట్లు పాఠశాలలో చేయాలన్నారు. జిల్లా అటవీ శాఖ అధికారులు సూచించిన విధంగా ఎంఈఓలు నర్సరీ పాయింట్ దగ్గరికి వెళ్లి మొక్కలను ఆయా మండల పాఠశాలలకు నిర్దేశించిన మొక్కల సంఖ్య ఆధారంగా ఆయా పాఠశాలలకు అందజేయాలని కలెక్టర్ సూచించారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం కలెక్టరేట్‌లో జరుగుతుందని కలెక్టర్ జె.వెంకటమురళి ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జిల్లా కలెక్టర్ కార్యాలయం, రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయాల్లో, తహశీల్దార్ కార్యాలయాల్లో ప్రజలు అర్జీలను ఇవ్వవచ్చని తెలియజేశారు. అర్జీదారులు మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందని, వారి అర్జీలు నమోదు చేసిన అర్జీల యొక్క స్థితికి సంబంధించి సమాచారం తెలుసుకోవడానికి 1100 నేరుగా కాల్ చేయవచ్చని కలెక్టర్ తెలియజేశారు.

సమ్మెను జయప్రదం చేయాలి

మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ పిలుపు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఈ నెల 9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏపి మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ పిలుపునిచ్చింది. ఆదివారం నాడు సిఐటియు కార్యాలయంలో సమ్మె వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా సెక్రటరీ కష్ణమోహన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, మందులు వైద్య పరికరాలపై జిఎస్‌టిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మెడికల్ రిప్రజెంటేటివ్స్‌కు కనీస వేతనం రూ.26,910 ఇవ్వాలని, సేల్స్ పేరుతో యాజమాన్యాల వేధింపులను, ఆగడాలను నిలువరించాలని కోరుతూ జిల్లాలో పనిచేస్తున్న రిప్రజెంటేటివ్స్ దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఫణింద్ర, సిఐటియు జిల్లా నాయకులు చీకటి శ్రీనివాసరావు, అధ్యక్షులు జె.ఉదయకిరణ్, కోశాధికారి వి.ఆంజనేయులు, జాయింట్ సెక్రటరీ గురవారావు, వైస్ ప్రెసిడెంట్ జి.వెంకటేశ్వర్లు, వర్కింగ్ కమిటీ సభ్యులు బాషా, రామక్రిష్ణ మెడికల్ రిప్ర జెంటేటివ్స్ పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల


ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు నగరంలోని డివిజన్లలో పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు హామీ ఇచ్చారు. ఒంగోలు నగరం 47, 48 డివిజన్‌లలో ఆదివారం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. 47వ డివిజన్ సరస్వతి శిశు మందిర్‌కు చేరుకున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావుకు డివిజన్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే దామచర్లకు మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఆయా డివిజన్లలోని ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకుని యాప్‌లో నమోదు చేశారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం చేసిన అభివద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది పాలనలో సూపర్ సిక్స్ అమలుకు కృషి చేస్తుందన్నారు. తల్లికి వందనం, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు, దీపం-2 పథకంలో ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు ఇచ్చిందన్నారు. త్వరలోనే అన్నదాత సుఖీభవ పథకంలో రైతులకు ఖాతాలకు డబ్బులు వేయనుందని, ఆగస్టు 15 నుంచి మహిళలలో ఆర్టీసి బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తుందన్నారు. తొలి ఏడాదిలో ఒంగోలు నియోజకవర్గంలో రూ.117.2 కోట్లతో నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రధానంగా ఒంగోలు నగర సుందరీకరణకు చర్యలు చేపట్టామని, పార్కులు, డివైడర్లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఒంగోలు నగరానికి ప్రతి రోజూ మంచినీరు ఇచ్చే కార్యక్రమాన్ని త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. 47, 48 డివిజన్‌ల్లో సిసి రోడ్లు, మురికి నీటి కాల్వలు వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. పెండింగ్‌లోని సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పిడిసిసి బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, ఏఎంసి మాజీ ఛైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు, టిడిపి ఒంగోలు నగర అధ్యక్షులు బండారు మదన్, మాజీ అధ్యక్షులు కొఠారి నాగేశ్వరరావు, మాజీ ఎఎంసి ఛైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు, మహిళా నాయకురాళ్లు టి.అనంతమ్మ, తమ్మిశెట్టి రమాదేవి, నగర కమిటీ నాయకులు, క్లస్టర్ కన్వీనర్, కో-కన్వీనర్లు, డివిజన్ పరిశీలకులు, డివిజన్ అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.